# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 19-3-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 168 పేజీలు:6 వెల: రూ.1/-


## గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ- ప్రిన్సిపాల్ రమేష్ బాబు

ఖమ్మం,మార్చి 18:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఐదవ తరగతి ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ గడువును మార్చి 20 వరకు పొడిగించారని టేకులపల్లి సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుకు అర్హులని, ఈ రెసిడెన్షియల్ విద్యాసంస్థలో సీటు పొందిన విద్యార్థికి ఉచిత భోజన వసతి సదుపాయాలతో పాటు విద్యార్థికి అవసరమగు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు,యూనిఫామ్స్,దుప్పట్లు, కాస్మోటిక్ మరియు వాషింగ్ చార్జీలు, ట్రంకు బాక్స్ మొదలైన సామాగ్రిని ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్నది. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా, అలాగే ఈ విషయం తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల, టేకులపల్లి, ఖమ్మం వారు తల్లిదండ్రులకు కూడా విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు.

## అరగంటలో అమెరికా మటాష్ !: ఉత్తరకొరియా

న్యూఢిల్లీ మార్చ్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: అమెరికాను అరగంటలో ఢీ కొట్టే ఇంటర్‌కాంటినెంటల్ బాలిస్టిక్ మిసైల్‌ను ఉత్తరకొరియాఅభివృద్ధి పరిచింది. ఇది 33 నిమిషాల్లో అమెరికాలోని లక్ష్యాలపై గురి తప్పకుండా ఢీ కొంటుందని చైనా అధ్యయనంఒకటి తేల్చింది. ఓపెన్ న్యూక్లియర్ నెట్‌వర్క్ అనలిస్ట్ తియన్రాన్ జుతెలిపిన వివరాలు అమెరికా వెన్నులో వణుకు పుట్టించేవిలా ఉన్నాయి. అమెరికాలో ఇప్పటికే ఉన్న క్షిపణి రక్షక వ్యవస్థ కూడా ఉత్తరకొరియా అభివృద్ధి చేసిన తాజా మిసైల్‌ను గుర్తించలేదట. ఉత్తరకొరియానుంచి ప్రయోగించిన 20 సెకండ్ల వరకూ అమెరికాకు కనీసం గుర్తించడం కూడా సాధ్యం కాదట. అమెరికాలోని తూర్పు తీరాన్ని అలాగే పశ్చిమతీరాన్ని కూడా ఈ క్షిపణి సులభంగా చేరగలదట. హ్వాసోంగ్-15పేరిట ఉత్తరకొరియాలోని కిమ్ ప్రభుత్వంఅభివృద్ధి పరిచిన ఈ అణ్వస్త్ర క్షిపణి రేంజ్ 13 వేల కిలోమీటర్లు. చైనా అధ్యయనంలో వెల్లడైన అంశాలపై అమెరికాలోని బైడెన్ప్రభుత్వం స్పందించాల్సి ఉంది.

## రద్దయిన పరీక్షలకు మళ్లీ ఫీజ్ కట్టక్కర్లేదు.. కేటీఆర్

హైదరాబాద్ మార్చ్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్‌పై మంత్రి కేటీఆర్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేపర్ లీక్‌పై నిపుణులతో చర్చించామని, సీఎం కేసీఆర్ ఆదేశాలతో రివ్యూ చేశామని తెలిపారు. పేపర్ లీక్‌పై కేసీఆర్‌కు నివేదిక ఇచ్చామని, ద్వారా 155 నోటిఫికేషన్లు ఇచ్చామని చెప్పారు. ద్వారా 37 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, 10 లక్షల మందికి ఒకేసారి పరీక్ష నిర్వహించిన ఘనత ఉందని చెప్పుకొచ్చారు. ఇద్దరు చేసిన తప్పునకు మొత్తం వ్యవస్థకే చెడ్డపేరు వచ్చిందని, పేపర్ లీకేజీ వెనుక ఎంతటివారున్నా వదిలిపెట్టేది లేదని మంత్రి కేటీఆర్ తేల్చి చెప్పారు. రద్దయిన పరీక్షలకు మళ్లీ ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని, ఇకపై జరిగే పరీక్షలను మరింత పటిష్టంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. గతంలో హాజరైన వారిని అర్హులుగా గుర్తిస్తామని, కోచింగ్ మెటీరియల్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు. నిరుద్యోగుల విషయంలో చిత్తశుద్ధితో ఉన్నామని, 2 లక్షల 30 వేల ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నామని కేటీఆర్ ప్రకటించారు. ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, అపోహలు సృష్టించేవారిని నమ్మొద్దని మంత్రి కేటీఆర్ తెలంగాణ యువతకు సూచించారు. ఇదిలా ఉండగా.. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీక్ కేసు నిందితులను సిట్ కస్టడీకి అప్పగించారు. 9 మంది నిందితులను 6 రోజుల కస్టడీకి నాంపల్లి కోర్టు అనుమతించింది. చంచల్‌గూడ జైలు నుంచి నిందితులను సిట్ అదుపులోకి తీసుకుంది. పేపర్ లీక్ వ్యవహారంలో ఆర్థిక లావాదేవీలపై సిట్ కూపీ లాగనుంది. ప్రశ్నాపత్రం ఎవరెవ్వరికి విక్రయించారనే దానిపై సిట్ ఆరా తీయనుంది. నిందితులను మార్చి 23 వరకు సిట్ అధికారులు విచారణ చేయనున్నారు.

## మహిళలపై సామెతలు ప్రయోగించొద్దు.. బండి సంజయ్‌ను హెచ్చరించిన మహిళా కమిషన్



హైదరాబాద్, మార్చి 18: బీఆర్ఎస్ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ తెలంగాణ మహిళా కమిషన్ ఎదుట శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా సంజయ్‌ను మహిళా కమిషన్ దాదాపు మూడు గంటల పాటు విచారించింది.

కవితపై చేసిన అనుచిత వ్యాఖ్యల పట్ల మహిళా కమిషన్ ఆయనను గట్టిగా నిలదీసినట్లు సమాచారం. గతంలోనూ అనుచిత వ్యాఖ్యలు చేసిన వీడియోలను సంజయ్‌కు కమిషన్ చూపించింది. తాను ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యానించలేదని బండి సంజయ్ కమిషన్ ఎదుట సంజాయిషీ ఇచ్చుకున్నట్లు తెలుస్తోంది. మరోసారి బండి సంజయ్‌ను కమిషన్ విచారించే అవకాశం ఉంది. మహిళలపై మరోసారి సామెతలు ప్రయోగించొద్దని సంజయ్‌ను కమిషన్ ఆదేశించింది. ఇలాగే అనుచిత వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఎవరైనా సరే మహిళలను కించపరిచేలా వ్యాఖ్యానిస్తే కఠిన చర్యలు తప్పవని మహిళా కమిషన్ హెచ్చరించింది.

## రిన్ని మినిస్ట్రీ సొసాయిటీ ఆధ్వర్యంలో చలి వేంద్రం ప్రారంభం



హైదరాబాద్ మార్చ్18 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);నల్లకుంట డివిజన్లోని ఫివర్ హాస్పటల్ చౌరస్తా వద్ద రిన్ని మినిస్ట్రీ సొసాయిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం బాలరాజు ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ వై. అమృత ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన స్వంత ఖర్చుతో చలి వేంద్రము ఏర్పాటు చేయటం చాలా సంతోషమని,ఫీవర్ హాస్పిటల్ ప్రక్కన చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయటం వల్ల హాస్పిటల్ కి వచ్చే రోగులు,రోడ్ పైన వెళ్లే పాదచారులు వాహన దారులు తమ దాహార్తిని తీర్చుకోవచ్చు అన్నారు. అనంతరం సంస్థ అధ్యక్షుడు గంధం బాలరాజు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా రక్త దాన శిబిరాలు,అనాధలకు పుస్తకాలు,భోజనము వారికి మందులు,దుస్తులు ఏర్పాటు చేయటం తమ సంస్థ లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమం లో హాస్పిటల్ సిబ్బంది చంద్ర శేఖర్,నరేందర్,అనిల్,నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు

## పేపర్ లీక్ కేసుపై టీఎస్‌పీఎస్సీకి సిట్ నివేదిక

- పేపర్ లీక్‌లో రాజశేఖర్ రెడ్డి కీలక సూత్రధారి
-ఉద్దేశపూర్వకంగానే టెక్నికల్ సర్వీస్ నుంచి టీఎస్‌పీఎస్సీకి డిప్యుటేషన్‌పై రాజశేఖర్
-పరీక్ష పత్రాన్ని ఉపాధ్యాయురాలు రేణుకకు అమ్మిన ప్రవీణ్

హైదరాబాద్ మార్చ్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: టీఎస్‌పీఎస్సీపేపర్ లీక్ కేసు లో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. పేపర్ లీక్ కేసుపై టీఎస్‌పీఎస్సీకి సిట్ నివేదిక ఇచ్చింది. పేపర్ లీక్‌లో రాజశేఖర్ రెడ్డి(కీలక సూత్రధారి అని తేల్చింది. ఉద్దేశపూర్వకంగానే టెక్నికల్ సర్వీస్ నుంచి టీఎస్‌పీఎస్సీకి రాజశేఖర్ డిప్యుటేషన్‌పై వచ్చాడని సిట్ నివేదికలో వెల్లడించారు. సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తూ ప్రవీణ్‌తో సంబంధాలు కొనసాగించాడని తెలిపారు. కంప్యూటర్‌ని హ్యాక్ చేసి పాస్‌వర్డ్‌ని రాజశేఖర్ దొంగిలించాడని తేల్చారు. పాస్‌వర్డ్‌ని తాను ఎక్కడా రాయలేదని శంకర్ లక్ష్మి చెబుతుండటంతో కంప్యూటర్ హ్యాక్ చేసినట్లు గుర్తించారు. పెన్‌డ్రైవ్ ద్వారా 5 పరీక్షా పత్రాలను రాజశేఖర్ కాపీ చేశాడని, కాపీ చేసిన పెన్‌డ్రైవ్‌ను ప్రవీణ్‌కు ఇచ్చాడని సిట్ నివేదికలో తెలిపారు. ఏఈ పరీక్ష పత్రాన్ని ఉపాధ్యాయురాలు రేణుకకు ప్రవీణ్ అమ్మాడని తేల్చారు. ఫిబ్రవరి 27నే రాజశేఖర్ పేపర్‌ను కాపీ చేశాడని తెలిపారు. గ్రూప్-1 పరీక్షాపత్రం లీకైనట్లు గుర్తించిన సిట్ ప్రవీణ్‌కు 103 మార్కులు రావడంపై విచారణ జరిపింది. సెక్రటరీ దగ్గర పీఏగా చేస్తూ ప్రవీణ్ గ్రూప్-1 పరీక్షా పత్రాన్ని కొట్టేసినట్లు నిర్ధారించారు.

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలానికి చెందిన ఉపాధ్యాయురాలు రేణుకతన తమ్ముడు రాజేశ్‌నాయక్ కోసం టీఎస్‌పీఎస్సీలో పనిచేసే ప్రవీణ్ ద్వారా ప్రశ్నపత్రాన్ని సంపాదించినట్లు వెల్లడైన విషయం తెలిసిందే. కాగా, ఈ ప్రశ్నపత్రాన్ని తమ తండాకే చెందిన నీలేశ్, శ్రీను, రాజేందర్‌నాయక్‌లకు ఇచ్చినందుకు రూ. 10 లక్షలు ఇచ్చేలా ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం మేరకు పరీక్షకు ముందురోజు వీరందరినీ వనపర్తిలోని తన ఇంటికి పిలిపించుకొని అక్కడే వారితో ప్రశ్నలకు జవాబులను ప్రాక్టీస్ చేయించింది. పరీక్ష రోజు తన కారు లోనే వారిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి పరీక్ష రాయించుకొని వచ్చింది.

కాగా, ఒప్పందం ప్రకారం పరీక్షకు ముందు ఒక్కొక్కరు రేణుకకు రూ. 2లక్షల చొప్పున చెల్లించారు. మిగిలిన మొత్తాన్ని పరీక్ష పూర్తయ్యాక ఇస్తామని చెప్పారు. దీంతో పరీక్ష ముగిసిన రోజు రాత్రి వనపర్తిలో రేణుక ఇంట్లో జరిగిన డిన్నర్ తర్వాత మిగిలిన మొత్తం ఇవ్వాలని అడిగింది. అయితే తమ వద్ద డబ్బులేదని, ఇవ్వలేమని వారు చేతులెత్తేశారు. దీంతో రేణుకకు, వారికి తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. ఆ సమయంలో ఆవేశానికి లోనైన నీలేశ్‌నాయక్.. డయల్ 100కు ఫోన్ చేసి విషయం చెప్పేశాడు. పోలీసులు వెంటనే స్పందించి రేణుకతోపాటు ఆమె సోదరుడిని, నీలేశ్‌ని, మిగిలిన ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.

రేణుక ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా చేరిన తర్వాత ఆమె నియామక పత్రంలో పేరులో ఒక అక్షరం పొరపాటుగా పడిందని, దానిని సరిచేసుకోవడానికి ఆమె టీఎస్‌పీఎస్సీని సంప్రదించి, పలుమార్లు హైదరాబాద్‌లోకి కార్యాలయానికి వెళ్లారని ఆ క్రమంలోనే ఆమెకు ప్రవీణ్‌తో పరిచయం ఏర్పడిందని చెబుతున్నారు. వారి పరిచయం కాస్తా స్నేహంగా మారి, ఆపై సాన్నిహిత్యం పెరిగి ఇంతటి అక్రమానికి దారితీసిందని స్థానికంగా చర్చ జరుగుతోంది. అంతేకాదు.. ప్రవీణ్‌కు ఎక్కువ మంది మహిళలతోనే మొబైల్ కాంటాక్టులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రవీణ్ మొబైల్ ఫోన్‌ను పరిశీలించిన పోలీసులు.. అతడు మహిళలతో సన్నిహితంగా మాట్లాడిన చాటింగ్‌లు, నగ్న చిత్రాలు ఉన్నట్లు గుర్తించారు.

ప్రవీణ్‌తో రెగ్యులర్‌గా కాంటాక్టులు, చాటింగ్‌లు చేస్తున్న వారిలో ఎక్కువగా మహిళలే ఉన్నట్లు సమాచారం. సుమారు 60 మంది మహిళలతో ప్రవీణ్‌కు కాంటాక్టులు ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది. దీంతో ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం ఆ 60 మందినీ విచారణకు పిలిచే అవకాశం ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా 2017 నుంచి ప్రవీణ్ మొబైల్ ఫోన్ డేటాను పోలీసులు రికవరీ చేయనున్నట్లు తెలిసింది. 2017 నుంచి టీఎ?సపీఎస్సీ ఆధ్వర్యంలో ఎన్ని పబ్లిక్ పరీక్షలు జరిగాయి? ఆ సమయంలో ప్రవీణ్ ఏవైనా అక్రమాలకు పాల్పడ్డాడా? అనే కోణంలోనూ దర్యాప్తు జరుపుతున్నారు.

## కరోనా వైరస్ ఆనవాళ్ల గురించి చైనా తన డేటాను షేర్ చేయడం లేదు

### - ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆగ్రహం



వాషింగ్టన్ మార్చ్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: కరోనా వైరస్‌ఆనవాళ్ల గురించి చైనా తన వద్ద ఉన్న డేటాను షేర్ చేయడం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థఆగ్రహం వ్యక్తం చేస్తోంది. కరోనా ఆనవాళ్లకు చెందిన అంశంపై శుక్రవారం డబ్ల్యూహెచ్‌వో కొన్ని కీలక ఆధారాలను వెల్లడించింది. కరోనా డేటాను మూడేళ్ల క్రితం ఎందుకు రిలీజ్ చేయలేదని చైనా అధికారుల్ని డబ్ల్యూహెచ్‌వో అడిగింది. జనవరిలో ఆన్‌లైన్‌లో పబ్లిష్ అయిన ఆ డేటా ఇప్పుడు ఎందుకు కనిపించడం లేదని కూడా ప్రశ్నించింది. అయితే అంతర్జాతీయ నిపుణులబృందాలు ఆ డేటాను డౌన్‌లోడ్ చేసి అధ్యయనం చేస్తున్నాయి. కరోనా వైరస్ అక్రమంగా ట్రేడింగ్ చేసిన రకూన్ కుక్కలనుంచి మనుషులకు సోకినట్లు ఆ డేటా ద్వారా శాస్త్రవేత్తలు అంచనాకు వస్తున్నారు. వుహాన్‌లో ఉన్న హువనన్ సీఫుడ్ హోల్‌సేల్ మార్కెట్‌లో ఆ ఇన్‌ఫెక్షన్ జరిగి ఉంటుందని భావిస్తున్నారు. కానీ చైనా అధికారులు జీన్ సీక్వెన్సింగ్‌డేటాను తొలగించడం వల్ల.. తుది ఫలితాలను పోల్చలేకపోతున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మూడేళ్ల క్రితమే ఆ డేటాను షేర్ చేస్తే బాగుండేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ చీఫ్ డాక్టర్ టెడ్రోస్ అథనమ్ గెబ్రియాసిస్ తెలిపారు. చైనా తన డేటా నుంచి తొలగించిన ఆధారాలను తక్షణమే అంతర్జాతీయ సమాజంతో షేర్ చేసుకోవాలని టెడ్రోస్ తెలిపారు. నక్కలాంటి జంతువులైన రకూన్ కుక్కల నుంచి కరోనా వైరస్ వ్యాప్తి చెంది ఉంటుందని డేటా ఆధారంగా నిపుణుల బృందం ఒక అంచనాకు వచ్చింది. వుహాన్ మార్కెట్‌లో సేకరించిన డీఎన్‌ఏ శ్యాంపిళ్లు కరోనా వైరస్ జెనటిక్ నిర్మాణం ఒకే రకంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గురించారు. తొలుత రకూన్ కుక్కలకు వ్యాపించిన వైరస్.. ఆ తర్వాత ఆ జంతువుల ద్వారా మనుషులకు వైరస్ వ్యాప్తి చెంది ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వుహాన్ మార్కెట్‌లో ఉన్న జంతువుల లాలాజలంశ్యాంపిళ్లను సేకరించిన శాస్త్రవేత్తలు తీవ్ర స్థాయిలో అధ్యయనం చేపట్టారు. జన్యుపరమైన కోణంలో వైరస్ నిపుణులు స్టడీ చేశారు.

## హైదరాబాద్ జంటనగరాల్లో భారీ వర్షం



హైదరాబాద్, మార్చి 18: హైదరాబాద్-సికింద్రాబాద్ జంటనగరాల పరిధిలో పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. బోయిన్‌పల్లి, మారేడ్‌పల్లి, చిలుకలగూడ, బేగంపేట, ప్యాట్నీ, అల్వాల్, తిరుమలగిరి, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, జీడిమెట్ల, ఆల్విన్ కాలనీ, బాచుపల్లి, నిజాంపేట, కాప్రా, ఈసీఐఎల్ పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మాదాపూర్, హైటెక్‌సిటీ, కుత్బుల్లాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్, పంజాగుట్టతో పాటు తదితర ప్రాంతాల్లో కొద్దిచోట్ల వానపడింది. పలుచోట్ల వడగళ్లు సైతం కురిశాయి. ఒక్కసారిగా వర్షం కురవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మరో వైపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లోనూ ఈదురుగాలులతో వడగళ్లవాన కురిసింది.

సంగారెడ్డి పటాన్‌చెరువులో, ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా పలుచోట్ల వడగళ్లు కురిశాయి. కరీంనగర్, రామగుడు, గంగాధర మండలాల్లో వర్షం కురిసింది. చందుర్తి, రుద్రంగి, బోయినపల్లి, భీమారం వడగళ్ల వర్షం కురిసింది. కామారెడ్డి జిల్లా బిచ్కుంద, జుక్కల్, పెద్దకోడపగల్, మద్నూర్ మండలం తడ్గూర్‌లో వడగళ్ల కురిసింది. మరో రెండు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తుందని తెలిపింది. కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మిగతా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది

## మన బస్తీ -మన బడి పనులను వేగవంతం చేయాలి : మంత్రి తలసాని




హైదరాబాద్, మార్చి 18: మన బస్తీ- మనబడి పనులను వేగవంతంగా చేపట్టి మే నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం నారాయణగూడ లోని కేశవ్ మెమోరియల్ లో మన బస్తీ- మన బడి కార్యక్రమం కింద మొదటి విడతలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులపై మంత్రి అధ్యక్షతన సమీక్ష సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించడం ద్వారా విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధన జరగాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని వెల్లడించారు. ఈ కార్యక్రమం అమలు కోసం రాష్ట్రంలో 26,065 పాఠశాలల్లో అభివృద్ధి పనులకోసం రూ. 7,289 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. ఇందులో మొదటి విడతలో 35 శాతంగా 9,123 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించామని పేర్కొన్నారు.

ఇందుకు గాను రూ. 3,497 కోట్లను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ నిధులతో పాఠశాలల్లో ప్రహరీగోడ నిర్మాణం , భవనాలకు పెయింటింగ్, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సరఫరా, టాయిలెట్స్ నిర్మాణం, ఫర్నిచర్ ఏర్పాటు, గ్రీన్ చాక్ బోర్డ్ ఏర్పాటు వంటి పనులను చేపడుతున్నట్లు వివరించారు. హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల పరిధిలో 690 పాఠశాలలు ఉండగా, మొదటి విడతలో 239 పాఠశాలల ను అభివృద్ధి పనులను గుర్తించి రూ. 44 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. వీటిలో వివిధ కారణాలతో 198 పాఠశాలల్లో మాత్రమే పనులను చేపట్టినట్లు వివరించారు.

ఈ పనులను కూడా ప్రభుత్వరంగ సంస్థలైన జీహెచ్ఎంసీ ,టీఎస్ ఎంఐడీసీ , టీఎస్ టీడబ్ల్యూఈడబ్ల్యూఐడీసీ, సీఆర్ఐటీసీల ఆధ్వర్యంలో చేపట్టామని పేర్కొన్నారు. సమావేశంలో హోంమంత్రి మహమూద్ అలీ, ప్రభుత్వ విప్ ప్రభాకర్ రావు, ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలేరు వెంకటేశ్, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ దేవసేన, జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేష్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, విద్యాశాఖ, అధికారులు పాల్గొన్నారు

## ‘పది’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి.. అధికారులను ఆదేశించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి

హైదరాబాద్, మార్చి 18:ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమీక్ష నిర్వహించారు. బషీర్‌బాగ్‌లోని తన కార్యాలయంలో సంబంధిత శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించి, పది పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పది విద్యార్థులకు సంబంధించిన హాల్ టికెట్లను ఈ నెల 24వ తేదీ నుంచి సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు మంత్రి తెలిపారు. ఆయా పాఠశాలలకు కూడా హాల్ టికెట్లు పంపుతామని చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 94 వేల 616 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరవుతున్నారని సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఇందుకోసం 2,652 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. త్వరలో డీఈవోలు,ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఏర్పాట్లపై సమీక్షించనున్నట్లు తెలిపారు.

ఏప్రిల్ 3వ తేదీ నుండి 13వ తేదీ వరకు ప్రతీ రోజు ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు.

పరీక్ష కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యా సంచాలకులు శ్రీదేవసేన, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు పాల్గొన్నారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ కుదిపెడి సంభాషణలా
కదిపెడి నటనమ్ము వాడు కమ్మని శైలిన
ముదము నిడు హాస్య నటుని
పదుగురి మది నిలచినాడు "బాబూ మోహన్"

(మార్చి 19 హాస్యనటుడు బాబూమోహన్ జననం...)

–రాధశ్రీ
సెల్:9494481210




సహృదయ (రి.నెం.2061/96)
సాహిత్య సాంస్కృతిక సంస్థ, వరంగల్లు

ఆహ్వానము

శ్రీ శోభకృత్ ఉగాది ఉత్సవము

ముఖ్య అతిథి : శ్రీ పరాంకుశం వెంకటకృష్ణ
చీఫ్ ఇంజనీర్, ఇరిగేషన్ క్వాలిటీ కంట్రోల్, హైదరాబాద్.

ఆత్మీయ అతిథి : శ్రీ వల్సపైడి
అధ్యాపకులు, మర్కజి ప్రభుత్వ ఉన్నత పాఠశాల,హనుమకొండ.

పంచాంగ పఠనం: శ్రీ నమిలికొండ విశ్వేశ్వరరావు, హనుమకొండ.

వేణుగాన సంగీత విభావరి
నాళ్ళ చెరువు ఆనంద తీర్థ
వేణుగాన విద్వాంసులు, హైదరాబాద్
సహకారం: కీబోర్డ్: కొరుపోజు శ్రీనివాస చారి, సంగీత దర్శకులు
తబలా: ఎస్.కె. వాజిద్ హుస్సేన్ జాఫర్, రిథమ్ పాడ్: కృష్ణ

తేది : 22-03-2023, బుధవారం సాయంత్రం 6.15 గం.లకు
వేదిక: ప్రభుత్వ మర్కజి ఉన్నత పాఠశాల, లష్కర్‌బజార్, హనుమకొండ.

అందరూ ఆహ్వానితులే

జి. గిరిజామనోహరబాబు – అధ్యక్షులు
డా.ఎస్.వి.ఎస్.చారి – ప్రధాన కార్యదర్శి

# జాతీయ విద్యా విధానం-2020 అమలులో రాజకీయాలు తగునా?!

స్వతంత్ర భారతంలో తొలిసారి 'జాతీయ విద్యా విధానం-1968(నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-1968 లేదా యన్ఈపీ-1968)' ప్రవేశ పెట్టడంతో రాష్ట్రాల జాబితాలో ఉన్న విద్య అంశం ఉమ్మడి జాబితాలోకి (కాన్‌కరెంట్ లిస్ట్) చేర్చబడింది. పాఠశాల విద్యా విధానంలో 'త్రిభాషా సూత్రాన్ని' ప్రతిపాదించిన నాటి యన్ఈపీ-1968ని తమిళనాడు రాష్ట్రం వ్యతిరేకించడం, ఆంగ్లం (అంతర్జాతీయ భాష), ప్రాంతీయ భాషతో పాటు హిందీ (జాతీయ భాష)ని తప్పనిసరి చేయడంతో తమిళుల ఆగ్రహం కట్టలు తెంచుకోవడం జరిగింది. నాడు యన్ఈపీ-1968ని అన్నాదురై నేతృత్వంలో తమిళులు తీవ్ర ఆందోళనలు జరపడం, హిందీ సబ్జెక్టును తప్పనిసరి చేయడం తగదని ప్రజాందోళనలు పెల్లుబికడం, యన్ఈపీ-1968 అమలుకు అంగీకరించమంటూ హిందీ సబ్జెక్టు తమకు సమ్మతం కాదని భీష్మించుకోవడం చూసాం.

**యన్ఈపీ అమలు ప్రశ్నార్థకం:**

పలు రాజకీయ, భాషా, సామాజిక కారణాలతో యన్ఈపీ పూర్తి అమలు ప్రశ్నార్థకంగా మారింది. యన్ఈపీ-1986 ప్రకారం ప్రతి రాష్ట్ర ఒక ఓపెన్ యూనివర్సిటీని ప్రారంభించాలని సూచించినప్పటికీ కేరళ మాత్రం 2020 వరకు ప్రారంభించనేలేదు. కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రవేశ పెట్టిన 'జవహార్ నవోదయ విద్యాలయాల(జెయన్‌వి)' స్థాపన ద్వారా హిందీ భాష తప్పనిసరి చేయడంతో నేటికీ తమిళనాడు రాష్ట్రంలో జవహార్ నవోదయ విద్యాలయాలను ప్రారంభించనేలేదని తెలుసుకోవాలి. యన్ఈపీ-1986 ప్రతిపాదించిన 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' సంస్థను కేంద్ర ప్రభుత్వమే 2017 వరకు ప్రారంభించకపోవడం కూడా యన్ఈపీ-1986 పవిత్రతను నీరుగార్చినట్లు అయ్యింది. 1966లోనే ఆర్టికిల్-45 ద్వారా 14 ఏండ్ల వరకు పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య చట్టం తీసుకువచ్చినప్పటికీ నాడు ప్రాథమిక పాఠశాలలో 76.7 శాతం, ప్రాథమికోన్నత విద్యలో 30.8 శాతం, ఉన్నత పాఠశాలలో 16.2 శాతం నమోదు మాత్రమే గమనించారు. 2010లో విద్యను పిల్లల మౌళిక హక్కుగా 'రైట్ టు ఎడ్యుకేషన్ బిల్'ను కూడా తీసుకురావడం జరిగిందని మనకు తెలుసు.

**యన్ఈపీ-2020 అమలు పట్ల కొన్ని అభ్యంతరాలు:**

యన్ఈపీ-2020లో ప్రతిపాదించిన నాలుగంచెల 5+3+3+4 విద్యా విధానం (ఫండమెంటల్, ప్రిపరేటరీ, మిడిల్, సెకండరీ విద్య) ఫలితంగా నేడు మన రాష్ట్రాలు పాటిస్తున్న 10+2 విధానానికి ప్రాధాన్యం కోల్పోవలసి వస్తున్నది. దీనికి విరుగుడుగా నేడు వివిధ రాష్ట్రాల తల్లితండ్రులు, పిల్లలు స్టేట్ సెలబస్ నుంచి సెంట్రల్ సిబియస్‌సి విధానానికి మారడం చూస్తున్నాం. నేటి యన్ఈపీ-2020 విధానంలో ప్రతిపాదించిన 'అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబిసి)', '4-ఏండ్ల డిగ్రీ', 'మల్టీ ఎంట్రీ', 'మల్టీ ఎగ్జిట్స్', 'ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్' లాంటివి సముచితంగా, ప్రయోజనకరంగా ఉండడంతో అందరి ఆమోదం పొందుతున్నది. యన్ఈపీ-2020ని వ్యతిరేకిస్తున్న రాష్ట్రాలు కూడా కొన్ని ప్రతిపాదనలను ఆమోదించి పాటించడం కూడా జరుగుతోంది. కేరళ, తమిళనాడు రాష్ట్రాలు కూడా 4-ఏండ్ల డిగ్రీ విధానాన్ని అమలు చేయడం శుభపరిణామంగా తీసుకోవాలి. తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, తెలంగాణ, కర్నాటక, పశ్చిమ బెంగాల్ లాంటి రాష్ట్రాలు కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేయడం జరుగుతున్నదని మరిచిపోరాదు.

రాజకీయ, సామాజిక కారణాలతో విద్యా విధానాలను వ్యతిరేకించడం సముచితం కాదని, మారుతున్న కాలంతో పాటు మన విద్యా విధానం కూడా మారాలని రాష్ట్ర ప్రభుత్వాలు తెలుసుకోవాలి. కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న వ్యత్యాసాలు పిల్లల చదువులకు అడ్డుపడకూడదు. ప్రాంతీయ భాషకు పట్టం కడుతూనే జాతీయ భాష హిందీలో కనీస పరిజ్ఞానం ఉండడం, గ్లోబల్ లాంగ్వేజ్‌గా ఇంగ్లీష్ భాషలో పట్టు సాధించాలి. స్వభాషా మోజులో పరభాషలను వ్యతిరేకించరాదు. ఆంగ్ల భాష వ్యామోహంలో తమ ప్రాంతీయ భాషను చిన్న చూపు చూస్తున్న తెలుగు రాష్ట్రాలను కూడా చూస్తున్నాం. భూమి కుగ్రామంగా మారిన నేటి డిజిటల్ యుగంలో త్రిభాషా సూత్రం దేశ యువతకు ప్రయోజనకారిగా ఉంటుందనడంలో అతిశయోక్తి లేదు.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# అభివృద్ధే నా నినాదం.. సమస్యలు లేని బస్తీలు, కాలనీలే నా లక్ష్యం- ఎమ్మెల్యే కెపి వివేకానంద గౌడ్

**-అభివృద్ధి పరంపరంలో సమస్యలున్నంత అవుతూనే ఉంటాయి**
**-ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగుదాం**
**-5 ఏళ్ల క్రితం బాచుపల్లి వేరు ఇప్పటి బాచుపల్లి వేరు**
**-ఇప్పటికే ఎంతో చేశాం.. మరింత చేస్తాం**
**-25వ రోజుకి చేరిన ప్రగతి యాత్ర**



హైదరాబాద్, మార్చి 18:అభివృద్ధే నా నినాదం.. సమస్యలు లేని బస్తీలు, కాలనీలే నా లక్ష్యమని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపి. వివేకానంద గౌడ్ స్పష్టంచేశారు. ప్రగతి యాత్రలో భాగంగా 25వ రోజు శనివారం నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి ఎస్‌వీఎస్ ఆభరణ కాలనీలో ఆయన పర్యటించారు. తొలుత కాలనీ అంతటా పాదయాత్ర నిర్వహించి గణష్ మండపం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కార్పొరేటర్ బాలాజీ నాయక్ కాలనీలోని సమస్యలను ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, ఇంచార్జి కమిషనర్ రామకృష్ణారావుకు సమస్యలను విన్నవించారు. అనంతరం కాలనీ అధ్యక్షురాలు, ప్రధాన కార్యదర్శి ఛాయాలక్ష్మి , ప్రతిమలు కాలనీలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

నా 20 ఏళ్ల రాజకీయ జీవితంలో మహిళా మణులను అధ్యక్ష, కార్యదర్శులుగా చూడలేదు

ఎస్‌వీఎస్ ఆభరణ కాలనీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ మాట్లాడుతూ తాను 20 ఏళ్లుగా రాజకీయ జీవితంలో కొనసాగుతున్నానని నా 20 ఏళ్ల రాజకీయ జీవితంలో ఓ కాలనీకి అధ్యక్ష, కార్యదర్శులు మహిళలు ఉండటం చూడలేదన్నారు. కాలనీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఛాయాలక్ష్మీ, ప్రతిమల కృషి గొప్పదన్నారు. ఓ వైపు ఇళ్లు చక్కపెట్టుకుంటూనే కాలనీని చక్కదిద్దుతున్న తీరు ప్రశంసించదగిందన్నారు. కాలనీలోని ప్రతి ఒక్కరు అసోసియేషన్ సభ్యులేనని కాలనీ అంతా ఐకమత్యంగా ఉండాలని సూచించారు. మానవజాతికి ఐక్యత ఎంతో ప్రధానమని ఐక్యత ఉంటే ఎలాంటి సమస్యనైనా పరిష్కరించుకోవచ్చని ఎస్‌వీఎస్ ఆభరణ కాలనీని సభ్యులనుద్దేశించి ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్ ప్రసంగించారు. గతి లేని సంసారం చేయొచ్చు కాని శృతి లేని సంసారం చేయలేము అనే గొడ్డు సామెతను ప్రతి ఒక్కరు గుర్తుంచుకుని అభివృద్ధి కోసం అందరూ ఐక్యమత్యతతో ఉండాలని కోరారు.

**రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్య పూర్తిగా తీర్చేస్తా..**

ఎన్నికలు డిసెంబర్ నెలలో జరుగనున్నందున ఆ లోపే ఎస్‌వీఎస్ ఆభరణలో అన్ని సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ కాలనీ వాసులకు హామినిచ్చారు. ఇప్పటికే కాలనీలో ఎస్ఎన్‌డీపీ కింద బాక్స్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని వాటర్ పైప్‌లైన్లు పూర్తిచేసి కాలనీ అంతటా సీసీ రోడ్లు నిర్మింపచేస్తామన్నారు. ఇక కాలనీకి శాశ్వతంగా తాగునీటిని పరిష్కరిస్తామని అందుకోసం గోదావరి జలాలను కాలనీకి తీసుకొచ్చి ప్రజల దాహార్తిని తీర్చుతామన్నారు. పొట్టి శ్రీరాములు యూనివర్సీటీలో 7.5 ఎమ్ఎల్ లీటర్ల సామర్థ్యంతో హెచ్ఎండబ్ల్యూఎస్ నీటి ట్యాంకును నిర్మిస్తుందని పొట్టి శ్రీరాములు యూనివర్సీటీ ఎత్తులో ఉన్న కారణంగా ప్రతి కాలనీకి సరిపోను తాగునీరు వస్తుందని టెన్షన్ పడవద్దని సూచించారు.

**గోపాల్ కాకను నమ్మకండి.. మేయర్ గొప్ప నాయకురాలు**

ఎస్‌వీఎస్ ఆభరణలో జరిగిన కార్యక్రమంలో చమత్కారం చోటుచేసుకుంది. స్టేజీ పైన ఉన్న మేయర్ భర్త గోపాల్‌రెడ్డిని ఉద్దేశిస్తూ ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్ గోపాల్ కాకను నమ్మొద్దని సమస్యలుంటే మేయర్ నీలా గోపాల్‌రెడ్డిని కలిసి విన్నవించాలని తెలిపారు. మేయర్ నీలా గోపాల్‌రెడ్డి స్థానింగా అందుబాటులో ఉంటారని షి ఈస్ ఏ జెంటిల్ లేడీ అని అభివర్ణించారు.

కమిట్‌మెంట్ ఉన్న నాయకురాలని కార్పొరేషన్ అభివృద్ధి కోసం ఎంతో చేస్తున్నారని జాతీయ స్థాయిలో కార్పొరేషన్‌కు అవార్డు రావడంలో ఆమె పాత్ర ఎంతో దాగి ఉందని గుర్తుకు చేశారు. అటు ఇంట్లో చేసుకుంటూనే కార్పొరేషన్‌ను పాలిస్తూనే బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి సైతం కృషిచేస్తున్నారని తెలిపారు.

**హిల్ కౌంటీ రోడ్డు పై కౌన్సిల్‌లో తీర్మానం చేయండి**

గ్రేటర్ హైదరాబాద్‌లో ట్రాఫిక్ సరళీకృతమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ అన్నారు. మంత్రి కేటీఆర్ గొప్ప విజన్‌తో గ్రేటర్‌లో ఇప్పటికే ఎన్నో లింక్ రోడ్లను పూర్తిచేయించారని తెలిపారు. వెంటనే నిజాంపేట్ కార్పొరేషన్‌లో హిల్ కౌంటీ విషయమై వెంటనే తీర్మాణం చేయాలని డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్‌కు సూచించారు. స్వయంగా హెచ్ఎండీఏ కమిషనర్‌తో భేటీ అయ్యి హిల్ కౌంటీ రోడ్డు పునరుద్దరించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే వివేక్ హామినిచ్చారు.

అనంతరం కాకతీయనగర్ కాలనీవాసులతో ముచ్చటించిన ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్ సమస్యలను పరిష్కరిస్తానని హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ- మేయర్ ధనరాజ్ యాదవ్, ఫ్లని?ర్ లీడర్ మరియు కార్పొరేటర్ ఆగం పాండు, కార్పొరేటర్లు విజయలక్ష్మీ, చిట్ల దివాకర్, గాజుల సుజాత, ఆగం రాజు, కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీమ్ గారు, బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ గారు, సీనియర్ నాయకులు చంద్రగిరి సతీష్, బీఆర్ఎస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివ రెడ్డి , స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ సతీష్ రెడ్డి, స్థానిక డివిజన్ మహిళా అధ్యక్షురాలు సంధ్య రాణి , ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, వాటర్ వర్క్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ సౌత్ జోన్ ఛాంపియన్ షిప్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే**

యూత్ అఫైర్స్ స్పోర్ట్స్ మంత్రిత్వ శాఖ చేపట్టిన ఖేలో ఇండియా స్కీమ్ లో భాగంగా స్పోర్ట్స్ అథారిటీ- ఆఫ్ ఇండియా సహకారంతో సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో దుండిగల్ ఎంఎల్ఆర్ఐటీ- వద్ద 18, 19వ తేదీలలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ సౌత్ జోన్ ఛాంపియన్‌షిప్ ను శనివారం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపి వివేకానంద్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఎంఎల్ఆర్ఐటీ- అధినేత డాక్టర్ మర్రి లక్ష్మణ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.

16- 18 ఏళ్లకు పైగా వయస్సు గల యువతులు ఈ పోటీ-ల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ క్రీడాకారులను అభినందించారు. సైక్లింగ్ క్రీడలలో యువతులు, మహిళలను ప్రోత్సహించే ఉద్దేశంతో చేపట్టిన ఖేలో ఇండియా ఉమెన్స్ సైక్లింగ్ ఛాంపియన్ షిప్ ను తన చేతుల మీదుగా ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సౌత్ జోన్ డా.మాక్స్‌వెల్ -టె-వర్, అడిషనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.కె.పాష మరియు కౌన్సిలర్ జక్కుల కృష్ణయాదవ్, దుండిగల్ రైడర్స్ భీమ్ సింగ్, ప్రవీణ్ గడిల, జగన్ నాయక్, హాజి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు

ఉపనయం- పెళ్లిలో పాల్గొని ఆశీర్వదించిన ఎమ్మెల్యే వివేకానంద గౌడ్‌నిజాంపేట్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ శ్రీ కృష్ణగార్డెన్స్‌లో బీఆర్ఎస్ నాయకులు అచంట రాము కుమారుడి ఉపనయనం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపి. వివేకానంద గౌడ్ పాల్గొని ఆశీర్వదించారు. అనంతరం హెచ్ఎండబ్ల్యూఎస్ ఏఈ సాయిరామ్‌రెడ్డి కుమార్తె వివాహానికి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ కార్పొరేటర్లు, లీడర్లు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గమని కక్షిదారులు లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకొండి

ఖమ్మం,మార్చి 18: (నేటినిజం ప్రతినిధి): లోక్ అదాలత్ లను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. టి. శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఖమ్మం కోర్టు ఆవరణలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాంక్ లోక్ అదాలత్ ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజీ మార్గమే రాజ మార్గమని కక్షిదారులు లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకొని తమ కేసులను శాంతి యుతంగా పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి 3 మాసములకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బ్యాంకులకు సంబంధించి కేసులు ఎక్కువగా పెండింగులో ఉన్నందున, రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ప్రత్యేకంగా బ్యాంక్ లోక్ అదాలత్ నునిర్వహిస్తున్నట్లు, ఇందులో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇతర బ్యాంకులకు సంబంధించిన కేసులు పరిష్కరించనున్నట్లు ఆయన అన్నారు. కేసులను రాజీతో ముగించేందుకు ఇలాంటి లోక్ అదాలత్ లు ఉపయోగ పడతాయన్నారు. ఎలాంటి ఫీజు లేకుండా న్యాయ సేవా సంస్థ సహకారంతో కేసులను పూర్తి చేసుకోవచ్చని ఆయన తెలిపారు.కేసులు రాజీ చేసుకోవడం ద్వారా అప్పీలు చేసుకోవడం ఉండదని, కోర్టు చుట్టూ తిరిగితే సమయం, డబ్బు వృధా అవుతుందని, లోక్ అదాలత్ ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని ప్రధాన న్యాయమూర్తి అన్నారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా మాట్లాడుతూ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ప్రత్యేక అనుమతితో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు ప్రత్యేక లోకదాలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. రుణ గ్రహీతలకు వడ్డీ పూర్తిగా మాఫీ చేయటంతో పాటు అసలు రుణంలో కూడా తగ్గింపు ఇస్తున్న బ్యాంకు అధికారులను ఆయన అభినందించారు. శనివారం బ్యాంక్ లోక్ అదాలత్ లో రూ. 6 లక్షలకు సంబంధించి 130 ప్రి లిటిగేషన్లను పరిష్కరించారు. అంతకుముందు ప్రధాన న్యాయమూర్తి బాల కార్మికుల నిర్మూలన, వరకట్నం రూపుమాపు, భ్రూణ హత్యలు నేరంలపై ప్రజల్లో అవగాహన, చైతన్యం కొరకు విస్తృత ప్రచారానికి రూపొందించిన వాల్ పోస్టర్లను ఆటోల వెనుక భాగంలో అంటించారు.

# అమెరికా నగరాలకు నిత్యానంద కుచ్చుటోపీ!

న్యూయార్క్, మార్చి 18: భారత్ నుంచి పరారైన స్వయం ప్రకటిత స్వామిజీ నిత్యానంద, 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస' దేశం పేరిట అమెరికాలోని 30 నగరాలతో 'సాంస్కృతిక భాగస్వామ్యం' చేసుకోవడం అమెరికావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కనీసం ఆ పేరుతో నగరం ఉందో లేదో కూడా చూడకుండా నగరాలన్నీ వరసగా నిత్యానంద ప్రతినిధుల మాటల్ని నమ్మేశాయంటూ ఫాక్స్ న్యూస్ విమర్శలు గుప్పించింది. "కైలాసతో ఈ ఏడాది జనవరి 12న నెవార్క్ నగరం 'సోదరి నగరం'గా ఒప్పందం చేసుకుంది. రిచ్‌మండ్, వర్జీనియా, డైటన్, ఒహాయో, ఫ్లోరిడా వంటి పెద్ద నగరాలు కూడా ఇలాంటి ఒప్పందాల్ని చేసుకున్నాయి. యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస గురించి గూగుల్‌లో వెతికినా వివరాలు లభించేవి. కానీ అలాంటి ప్రయత్నాలేవీ అమెరికా నగరాలు చేయలేదు" అని ఫాక్స్ న్యూస్ సంస్థ వెల్లడించింది. ఇక.. ఒప్పందం చేసుకున్న నెవార్క్ నగర అధికారులు ఈ పరిణామంపై స్పందించారు. నిజం తెలిసిన వెంటనే ఒప్పందాన్ని రద్దు చేశామని విచారం వ్యక్తం చేశారు.

# దేశంలో 24 కోట్ల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

న్యూఢిల్లీ, మార్చి 18:దేశంలో 24 కోట్ల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇవ్వడం జరిగింది. కేంద్ర పశుసంవర్ధక శాఖ, రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల పశు సంవర్ధక శాఖలు పశువుల యజమానులు అందించిన సహకారంతో కార్యక్రమం దేశ వ్యాప్తంగా విజయవంతం అయ్యింది.

గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని అమలు చేయడానికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం కేంద్ర ప్రాయోజిత పథకం కింద సమకూరుస్తోంది. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను కేంద్ర ప్రభుత్వం సేకరించి రాష్ట్రాలకు సరఫరా చేస్తోంది. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రయోజనాలను పశువుల యజమానులకు వివరించి, పశువులకు టీకా వేయించే అంశంపై అవగాహన కల్పించడానికి మంత్రిత్వ శాఖ అనేక కార్యక్రమాలు నిర్వహించింది. పశువులకు అవసరమైన టీకాలు పశు ఆరోగ్య కార్యకర్తలు/ పశు వైద్య డాక్టర్ల వద్ద అందుబాటులో ఉంచింది. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సహకారంతో టీకాలు వేయడానికి అవసరమైన శిక్షణ కార్యక్రమాలను పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిర్వహించింది.

కార్యక్రమం రెండో దశలో 25.8 కోట్ల పశువులకు ( రాష్ట్రాల నుంచి అందిన సమాచారం మేరకు) గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ఇంతవరకు 24 కోట్ల పశువులకు టీకాలు జరిగింది. సమిష్టి కృషితో లక్ష్యంలో 95% లక్ష్యాన్ని చేరుకొని పశువులకు రోగ నిరోధక శక్తిని ఎక్కువ చేయడానికి చేపట్టిన కార్యక్రమం విజయవంతం అయ్యింది. కేంద్ర పశుసంవర్ధక శాఖ, రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల పశుసంవర్ధక శాఖలు పశువుల యజమానులు అందించిన సహకారంతో కార్యక్రమం లక్ష్యాల మేరకు విజయవంతం అయ్యింది.

కేంద్ర ప్రాయోజిత పథకంగా కార్యక్రమాన్ని అమలు చేయడానికి అవసరమైన 100% నిధులు విడుదల చేస్తున్న కేంద్ర ప్రభుత్వం టీకా ఛార్జీలు, ఉపకరణాలు, అవగాహన కల్పించడం, కోల్డ్ చైన్ సౌకర్యాలు సమకూర్చుకోవడానికి రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలకు సహకారం అందిస్తోంది. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం ప్రయోజనాలను పశువుల యజమానులకు వివరించి, పశువులకు టీకా వేయించే అంశంపై అవగాహన కల్పించడానికి మంత్రిత్వ శాఖ అనేక కార్యక్రమాలు నిర్వహించింది.

నిరంతర ప్రయత్నాలతో దేశంలో గాలికుంటు వ్యాధి నియంత్రణ, నిర్మూలన కోసం జరుగుతున్న కార్యక్రమాలు లక్ష్యాల మేరకు అమలు జరుగుతాయని భావిస్తున్నారు. దీనివల్ల పశువుల పెంపకందారుల / సంరక్షకుల ఆదాయం పెరుగుతుంది. పశువుల ఉత్పత్తుల రంగంలో వాణిజ్యాన్ని పెంచడంలో సహాయపడుతుంది.

గాలికుంటు వ్యాధి అనేది పశువులకు ముఖ్యంగా భారత దేశంలో పశువులు మరియు గేదెలకు సంక్రమిస్తున్న వ్యాధుల్లో ఒక ప్రధాన వ్యాధి. దీనివల్ల పాల దిగుబడి తగ్గి పశువుల యజమానులకు భారీ ఆర్థిక కలుగుతుంది. . సమస్యను పరిష్కరించడానికి పశు సంవర్ధక , పాడి పరిశ్రమ విభాగం 2019లో నేషనల్ యానిమల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ (ఔంఆఅఖ)ని ప్రారంభించింది, ఇది ఇప్పుడు లైవ్‌స్టాక్ హెల్త్ గా అమలు జరుగుతున్నది. టీకాలు వేయడం ద్వారా 2030 నాటికి గాలికుంటు వ్యాధిని నియంత్రించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీని ఫలితంగా దేశీయ ఉత్పత్తి పెరుగుతుంది. పశువుల ఉత్పత్తుల ఎగుమతులు పెరుగుతాయి. ప్రస్తుతం ఈ కార్యక్రమం కింద అన్ని పశువులు, గేదెలకు టీకాలు వేస్తారు.

# మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే వేదిక 'హర్‌స్టార్ట్', ఇటీవల ప్రారంభించబడింది- కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, మార్చి 18:మహిళా స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి మరియు మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి కొత్తగా రూపొందించిన 'హర్‌స్టార్ట్' ప్లాట్‌ఫారమ్‌ను ప్రవేశపెట్టినట్లు పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్, అటామిక్ ఎనర్జీ మరియు స్పేస్, కేంద్ర సైన్స్ ఉ టెక్నాలజీ;పీ ఎం ఓ సహాయ మంత్రి, ఎర్త్ సైన్సెస్ (స్వతంత్ర బాధ్యత) సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ఈరోజు ఇక్కడ తెలియజేశారు. కొత్త ప్లాట్‌ఫారమ్‌ను ఇటీవల భారత రాష్ట్రపతి ప్రారంభించారని ఆయన చెప్పారు.

పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన భారత్ స్టార్టప్ సమ్మిట్ మరియు ఎక్స్‌పో 2023 ప్లీనరీ సెషన్‌లో మంత్రి ప్రసంగిస్తూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం మహిళలకు వారి నేతృత్వంలోని స్టార్టప్‌లకు ఒక సంవత్సరం వరకు నెలవారీ భత్యం ? 20,000 కూడా ప్రవేశపెట్టిందని మంత్రి తెలియజేశారు.

డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థలో మన వారసత్వ సంపద లో వ్యవస్థాపకత ఇమిడి ఉందని అన్నారు. కొన్ని కుటుంబ యాజమాన్య పరిశ్రమలు మాత్రమే ఉండే చరిత్ర నుంచి స్వాతంత్ర్యానంతర కాలం లో భారతదేశం ప్రపంచానికి 100 కంటే ఎక్కువ యునికార్న్‌లను అందించే వరకు, భారతీయ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ గణనీయమైన దృష్టిని ఆకర్షించిందని, తద్వారా ప్రపంచ మార్కెట్‌లలో అత్యంత గౌరవనీయమైనవాటిలో ఒకటిగా మారిందని ఆయన అన్నారు.

బ్లాక్ చైన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఎసీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఒఎ), మరియు మెషిన్ లెర్నింగ్ మొదలైన సాంకేతికతలతో స్టార్టప్‌లు ఆవిష్కరణలు చేసే అవకాశాలను భవిష్యత్ పోకడలు చూపుతాయని మంత్రి అన్నారు. భారతదేశం తలపెట్టిన విధాన సంస్కరణలతో స్టార్టప్‌లు పెద్ద పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు.

పెరుగుతున్న మహిళా పారిశ్రామికవేత్తల ప్రాబల్యం గురించి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, దేశంలో ఉపాధి అవకాశాలను సృష్టించడం, జనాభా సరళులలో మార్పులను తీసుకురావడం, తరువాతి తరం మహిళా వ్యవస్థాపకులకు స్ఫూర్తినివ్వడం ద్వారా మహిళల నేతృత్వంలోని వ్యాపార సంస్థలు సమాజంలో గుర్తించదగిన పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. భారతదేశంలో ప్రస్తుతం వున్న 36 యునికార్న్‌లు మరియు సంభావ్య యునికార్న్‌లలో కనీసం ఒక మహిళా వ్యవస్థాపకురాలు లేదా సహ వ్యవస్థాపకులు ఉన్నారు. ప్రభుత్వ భారత దేశం మహిళా వ్యవస్థాపకత కోసం కార్యక్రమాలు, పథకాలు, నెట్‌వర్క్‌లు మరియు కమ్యూనిటీలు స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో విభిన్న లబ్ధిదారుల మధ్య భాగస్వామ్యాలను సక్రియం చేయడం ద్వారా వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను రూపొందించడానికి కట్టుబడి ఉంది.

నూతన ఆవిష్కరణలకు జన్మస్థానం గా భారతదేశం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని మంత్రి అన్నారు. ఇది జ్ఞాన ఆధారిత ఆర్థిక వృద్ధి నమూనాకు కార్మిక- ఉపాధి అవకాశాలు ఎక్కువగా చేసే, పెట్టుబడి ప్రాధాన్య మరియు ఉత్పాదక దేశంగా భారత్ ప్రయోజనాలను తిరిగి ఆవిష్కరించడానికి కట్టుబడి ఉంది.

మహమ్మారి సమయంలో స్టార్టప్‌లు పోషించిన కీలక పాత్రను గురించి డాక్టర్ జితేంద్ర సింగ్ మాట్లాడుతూ, మహమ్మారి సమయంలో ప్రపంచం ఇబ్బందులుపడుతున్నప్పుడు, భారతీయ స్టార్టప్‌లు కొత్త పరిస్థితితో సర్దుబాటు కావడానికి తమ వ్యూహాలను మార్చాయి, సందర్భానికి అనుగుణంగా మార్చుకున్నాయి. కొన్ని అద్భుతమైన ఆవిష్కరణలు మరియు వృద్ధిని చూపించాయి. "భారతదేశం ఈవ్యాపారాలు మరియు డిజిటల్ వ్యాపారాలు మరియు స్టార్టప్‌లు ఉవందుకుంటున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అగ్ర దేశాలలో ఒకటిగా ఉండాలని మన దేశం ఆకాంక్షిస్తోంది'' అని ఆయన తెలిపారు.

దేశంలో వ్యవస్థాపక పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి స్టార్టప్ ఇండియా యాక్షన్ ప్లాన్ చాలా ముఖ్యమైన దశ అని మంత్రి అన్నారు. ఆర్థిక వృద్ధి మరియు ఉపాధి కల్పన రెండింటికీ యంత్రం గా భారతదేశంలో ఆవిష్కరణలను పెంపొందించడానికి బలమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి ఈ కార్యాచరణ ప్రణాళిక ఉద్దేశించబడింది.

ఈ రోజు భారతదేశం డీ పీ ఐ ఐ టీ గుర్తింపు పొందిన స్టార్టప్‌లు 93,000 కంటే ఎక్కువ వున్నాయి. 108 యునికార్న్‌లకు నిలయంగా ఉందని డాక్టర్ జితేంద్ర సింగ్ ఉద్ఘాటించారు. గత నాలుగు సంవత్సరాల్లో, ఈ సంఖ్య విపరీతంగా పెరుగుతోంది, ప్రతి సంవత్సరం అదనపు ఎదుగుతున్న యునికార్న్‌ల సంఖ్యలో సంవత్సరానికి 66% పెరుగుదల ఉంది. మహమ్మారి సమయంలో ఇంటి నుండి పని చేయడం భారతదేశంలో డిజిటల్ వ్యాపారాల వృద్ధికి ఆజ్యం పోసింది, ఈ సంఘటన స్టార్టప్ వృద్ధి కి కూడా దారితీసింది.మనం క్రమంగా యునికార్న్ యుగం నుండి డెకాకార్న్ యుగానికి మారుతున్నాము. జనవరి 2023 నాటికి, ప్రపంచవ్యాప్తంగా 47 కంపెనీలు డెకాకార్న్ హోదాను సాధించాయి. ప్రస్తుతం, భారతదేశంలో ఐదు స్టార్టప్‌లు డెకాకార్న్లు గా ఎదిగాయి, అవి ఫ్లిప్‌కార్ట్, బైజు, నైకా, స్విగ్గి మరియు ఫోన్ పే డెకాకార్న్ బృందం లో చేరాయని "అని మంత్రి తెలిపారు.

పరిశ్రమలతో భాగస్వామ్యాన్ని ఏర్పరచుకోవడం, అత్యాధునిక సాంకేతికతలు,ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి మరియు సాధ్యమైనంత తక్కువ సమయంలో వాటిని మార్కెట్ లో ప్రవేశ పెట్టడంలో విద్యాసంస్థలు మరియు పరిశ్రమల మధ్య సంబంధాలను బలోపేతం చేయడం ఈ ప్రస్తుతం అత్యంత ఆవశ్యకమని మంత్రి అన్నారు.

"పరిశ్రమ మొదటి నుండి ఉత్పత్తిని గుర్తించి, ప్రభుత్వంతో సరిపోయే ఈక్విటీని పెట్టుబడి పెట్టినట్లయితే స్టార్టప్‌లు స్థిరంగా మారతాయి. అప్పుడు మాత్రమే మనం "సమర్థ్" మరియు "ఆత్మనిర్భర్ భారత్" కోసం ప్రధాన మంత్రి యొక్క దార్శనికత దృష్టి ని గ్రహించగలము. దేశంలో ఆవిష్కరణల ఆవరణాన్ని ప్రోత్సహించడానికి ఈ ప్రభుత్వం లో నిధులు అడ్డంకి కాబోవని నేను మీకు హామీ ఇస్తున్నాను." అన్నారాయన.

ఈ పర్యావరణ వ్యవస్థలో పిహెచ్‌డిసిసిఐ పరిశ్రమ సభ్యులు చాలా ముఖ్యమైన పాత్ర పోషించాలని మంత్రి అన్నారు. "అందరి సమిష్టి కృషితో మనం ఈనాటికి 108 యునికార్న్‌ల నుండి వచ్చే సంవత్సరంలో 200 యునికార్న్‌లకు ఎదిగేందుకు సిద్ధంగా ఉన్నామని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను. ఇక్కడ ఉన్న యువ పారిశ్రామికవేత్తలకు మరియు భారతదేశాన్ని ప్రపంచంలోని స్టార్టప్ హబ్‌గా మార్చడానికి కృషి చేస్తున్న నా దేశస్థులందరికీ నేను శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను" అని ఆయన ముగించారు.

# శ్రీ సత్యసాయి జిల్లాలో బొలెరో -ఆటో ఢీ: ఆరుగురు మృతి

అమరావతి, మార్చి 18:శ్రీసత్యసాయి జిల్లాలో. శుక్రవారం సాయంత్రం బొలెరో , ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి చెందారు సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం పోట్లపర్రి వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. స్పాట్‌లోనే 5గురు మృతి చెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయచర్యలు చేపట్టారు. ధర్మవరం నుంచి బత్తలపల్లి వెళ్తుతుండగా ప్రమాదం చోటుచేసుకుంది

# దేశవ్యాప్తంగా 250 ఆదర్శ గ్రామ పంచాయతీ క్లస్టర్ల ఏర్పాటు ప్రాజెక్టు పురోగతిని సమీక్షించిన కేంద్ర మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్

న్యూఢిల్లీ, మార్చి 18:దేశవ్యాప్తంగా 250 ఆదర్శ గ్రామ పంచాయతీ క్లస్టర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రాజెక్టు పురోగతిని కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతి రాజ్ శాఖ మంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ , 2023 మార్చి 16న న్యూఢిల్లీ లో జరిగిన ఒక సమావేశంలో వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా సమీక్షించారు. ఇందుకు సంబంధించి 250 ఆదర్శ గ్రామ పంచాయితీ క్లస్టర్ల రాష్ట్ర ప్రాజెక్టు కోఆర్డినేటర్లు (ఎస్ పిసిలు), జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతిరాజ్ సంస్థ యంగ్ ఫెలోస్ లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సమావేశంలో కేంద్ర పంచాయతిరాజ్ శాఖ కార్యదర్శి శ్రీ సునీల్ కుమార్, ఎన్.ఐ.ఆర్.డి, పి.ఆర్ డైరక్టర్ జనరల్ డాక్టర్ జి. నరేంద్ర కుమార్, పంచాయతి రాజ్ మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ చంద్రశేఖర్ కుమార్, పంచాయతిరాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ వికాస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. వర్చువల్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి యంగ్ ఫెలోస్ తోపాటు 210 మందికి పైగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ గిరిరాజ్ సింగ్, దేశవ్యాప్తంగా 250 ఆదర్శ గ్రామ పంచాయితీ క్లస్టర్ల ఏర్పాటు ప్రాజెక్టులో భాగంగా , గ్రామపంచాయతీల సంపూర్ణ అభివృద్ధికి వీలు కల్పించే విధంగా ఆదర్శ గ్రామ పంచాయితీల అభివృద్ధి గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. మారుమూల ప్రాంతాలలో పనిచేస్తున్న యువత, ప్రజల భాగస్వామ్యంతో మరింత మంది విద్యార్థులు నాణ్యమైన విద్య అందుకునేలా కృషి చేయాలని, విద్యార్థులు మధ్యలోనే బడి మానేసే పరిస్థితి ఉండకుండా చూడాలని అన్నారు.

గ్రామ పంచాయతీలలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను స్థానికీకరించి అమలు చేయడంలో యంగ్ ఫెలోస్ కీలక పాత్ర పోషిస్తారని ఆయన అన్నారు. గ్రామ పంచాయతీలలో అమలు చేసే వివిధ పథకాలను గరిష్ఠస్థాయిలో లక్ష్యాల సాధనకు వ్యూహాన్ని చేపట్టాలని, ఇది మిషన్ మోడ్ లో జరగాలని కేంద్ర మంత్రి సూచించారు. ఇందుకు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని, ఆదర్శ గ్రామ పంచాయతిలలో పేదరిక నిర్మూలన, ఆర్థిక సాధికారత సాధించేందుకు భాగస్వాములందరి సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.

విద్యతో కూడిన పంచాయితీలు, స్వచ్ఛతతో కూడిన పంచాయితీలు, స్త్రీ,పురుషులకు ఉపాధి అవకాశాలు కలిగిన పంచాయితీలు,హరిత పంచాయితీలు, ఆరోగ్య కరమైన పంచాయితీలు, స్వావలంబన కలిగిన పంచాయితీలు, సాధించేందుకు కృషి చేయాల్సిందిగా మంత్రి వారికి సూచించారు. స్థానిక ప్రజలను వీటన్నింటిలో భాగస్వాములను చేయాలని , ఆరు గ్రామ సభ లను ఏర్పాటుచేయాలని సూచించారు. యంగ్ ఫెలోస్ అందరూ పాల్గొనేలా , రోజంతా ఒక జాతీయ వర్క్షాప్ను నిర్వహించాల్సిందిగా ఎన్ఐఆర్డి, పిఆర్కు మంత్రి సూచించారు. అలాగే ఈ పథకం కింద గల ఆదర్శ గ్రామ పంచాయితీలు సాధించిన పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు వీలుగా ఒక డాష్ బోర్డును రూపొందించాల్సిందిగా మంత్రి కోరారు.

గ్రామ పంచాయితీల అభివృద్ధి ప్రణాళికల ప్రాధాన్యతను కేంద్ర మంత్ర ప్రముఖంగా ప్రస్తావించారు. పంచాయితీల సమగ్ర అభివృద్ధికి యంగ్ ఫెలోస్ (వై. ఎఫ్. లు) సంబంధిత ప్రమాణాలకు అనుగుణంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని మంత్రి సూచించారు.

స్థానికంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించడంలో, హరిత, పరిశుభ్ర గ్రామాల విషయంలో, ఆరోగ్య గ్రామాలు, మంచినీరు చాలినంత కలిగిన గ్రామాలు, మహిళలకు అనుకూల గ్రామాలు, పిల్లలకు అనువైన గ్రామాలు ఇలా వివిధ రంగాలలో గరిష్ఠ ఫలితాలు సాధించేలా గ్రామపంచాయితీలు కృషి చేయాలని సూచించారు. దేశ వ్యాప్తంగా ఆదర్శ గ్రామపంచాయితీలు తీర్చిదిద్దడంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి అనుసరించవలసిన భవిష్యత్ వ్యూహాలు, వనరుల సద్వినియోగం వంటి విషయాలను ఈ సమావేశంలో చర్చించారు. దేశవ్యాప్తంగా 250 ఆదర్శ గ్రామపంచాయితీ క్లస్టర్ల ఏర్పాటు ప్రాజెక్టు అమలులో పురోగతి, వివిధ అంశాలపై సిపిఆఆర్డిపి, ఎస్.ఎస్.డి, ఎన్ .ఐ.ఆర్.డి, పి.ఆర్ ఫాకల్టీ అధిపతి డాక్టర్ అంజన్ కుమార్ భంజా, కొందరు యంగ్ ఫెలో లు ఉత్తరప్రదేశ్కు చెందిన పూనమ్ ఖత్రి, గుజరాత్ కుచెందిన సుమన్ ఖాతిక్, అస్సాంకు చెందిన జ్యోతిస్మిత దేకా,

మహారాష్ట్రకు చెందిన శ్రీ ఆదిత్య ఇంగ్లే, ఉత్తరాఖండ్ కుచెందిన చిత్రాంసి ధామి, బీహార్కు చెందిన అంగితా కుమారి, పశ్చిమబెంగాల్ కు చెందిన రిచా మిత్రా, హిమాచల్ ప్రదేశ్ కుచెందిన నవ్న శర్మ, మధ్యప్రదేశ్ కు చెందిన శ్రీ కృష్ణ మధాసియా, ఉత్తరాఖండ్ కు చెందిన శ్రీ గణేశ్ సింగ్ తదితరులు క్షేత్రస్థాయిలో తమ అనుభవాలపై ప్రెజెంటేషన్ ఇచ్చారు.

# రూ. 6.62 కోట్ల వ్యయంతో నారాయణి నది ఒడ్డున చేపట్టిన అభివృద్ధి పనులు

న్యూఢిల్లీ, మార్చి 18:నమామి గంగె కార్యక్రమం కింద బీహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లాలోని నారాయణి నది ఒడ్డు అభివృద్ధిని చేపట్టి, మొత్తం రూ.. 6.62 కోట్ల వ్యయంతో రెండు ఘాట్లను నిర్మించడం జరిగింది.

జాతీయ జలమార్గాల చట్టం, 2016 కింద దేశవ్యాప్తంగా 111 జాతీయ జలమార్గాలతో పాటు గండక్ నది (నారాయణి నది)ని భజసాలాటా బ్యారేజ్ నుంచి గండక్, హైపూర్ వద్ద గంగా నది సంగమం వరకు జాతీయ జలమార్గం (ఎన్‌డబ్ల్యు)-37 గా ప్రకటించారు.

గండక్ నది అధ్యయన నివేదికల లోని విషయాల ఆధారంగా, ఈ జలమార్గం షిప్పింగ్, ఓడప్రయాణానికి అనువుగా ఉన్నట్టు కనుగొనారు. అయితే, సంభావ్య రవాణా సరుకు అందుబాటులో లేకపోవడం, ఎన్‌డబ్ల్యు-37 మీదుగా ఉన్న నిర్మాణం - అంటే రేవా ఘాట్ బ్రిడ్జి కారణంగా, ఓడప్రయాణం/ వెర్టికల్ క్లియరెన్స్ వల్ల తక్కువగా ఉండడంతో, గండక్ నది (ఎన్‌డబ్ల్యు- 37) పై చేపట్టిన అభివృద్ధి కార్యక్రమా లను నిలుపదల చేయడం జరిగింది.

ఈ సమాచారాన్ని, కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి శ్రీ సర్బానంద సోనోవాల్ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం రూపంలో వెల్లడించారు.

# సీఐడీ డీజీపీ చొరవతో.. ఇటుక బట్టీ కార్మికులకు విముక్తి..



కరీంనగర్, మార్చి 18: సీఐడీ డీజీపీ మహేశ్ భగవత్ చొరవతో ఇటుక బట్టీల కార్మికులకు విముక్తి లభించింది. ట్విట్టర్‌లో చేసిన పోస్టుకు స్పందించిన సీఐడీ డీజీపీ ఆదేశాల మేరకు కరీంనగర్ సీఐడీ డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటలో గల ఇటుక బట్టీల్లో నిర్బంధంలో ఉన్న ఒడిశా కార్మికులను వారి స్వస్థలాలకు తరలించారు. ఒడిశా రాష్ట్రంలోని పదంపూర్ బొలాంగూర్ జిల్లాకు చెందిన గోవర్ధన్ నాగ్, అతని సతీమణి అహల్య నాగ్, వారి పిల్లలు నలుగురితో పాటు సురేంద్ర మాలిక్, అతని సతీమణి ఉమావతి మాలిక్ గరాలను పెద్దపల్లి పోలీసుల సహకారంతో ఇటుక బట్టీల నుంచి విముక్తి కల్పించారు. బాధితులను వారి వారి స్వస్థలాలకు పంపించినట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

# అంతర్జాతీయ వేదికమీద భారత్ ను గర్వపడేట్టు చేసిన ఆడిట్ ఆన్ లైన్ యాప్

న్యూఢిల్లీ, మార్చి 18:అన్ని పంచాయితీరాజ్ సంస్థలకూ ఆన్ లైన్ లో ఆడిట్ చేయగలిగేలా రూపొందించిన ఆడిట్ ఆన్ లైన్ సాఫ్ట్ వేర్ కు అంతర్జాతీయ గుర్తింపు లభించినంది. పంచాయితీ రాజ్ మంత్రిత్వశాఖ, ప్రభుత్వానికి సాంకేతిక భాగస్వామిగా వ్యవహరిస్తున్న నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ ఐ సి) జెనీవా కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ సంఘటన వారి సమాచార సమాజ ప్రపంచ సదస్సులో ఈ పురస్కారం అందించారు.

కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్ శాఖామంత్రి శ్రీ గిరిరాజ్ సింగ్ ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించిన సందర్భంగా పంచాయితీరాజ్ మంత్రిత్వశాఖ బృందానికి, ఎన్ ఐ సి బృందానికి అభినందనలు తెలియజేశారు.

ఆడిట్ ఆన్ లైన్ యాప్: సి కేటగిరీ లో ప్రభుత్వ ఆడిట్ నిర్వహించటానికి ఈ యాప్ ఉపయోగపడుతుంది. దీన్ని 12 వ సమాచార సమాజపు ప్రపంచ సదస్సు ( డబ్ల్యు ఎస్ ఐ ఎస్) బహుమతులు-2023 కోసం సమర్పించగా జెనీవాలోని అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ల యూనియన్ పరిశీలించింది. ఇది ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ పురస్కారం. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనకోసం ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాలు ప్రోత్సహించటానికి అందిస్తారు. ఈ పోటీ ఐదు దశలలో జరుగుతుంది. 1) దరఖాస్తు సమర్పించే దశ 2) సమర్పించిన ప్రాజెక్టులను పరిశీలించే నామినేషన్ దశ (18 యాక్షన్ లైన్ విభాగాలలో ఒక్కో విభాగానికి 20 ప్రాజెక్టుల చొప్పున) 3) డబ్ల్యు ఎస్ ఐ ఎస్ భాగస్వాములందరీ వోటు వేసేలా ఆన్ లైన్ ఓటింగ్ 4) ఎక్కువ వోట్లు తెచ్చుకున్న ఐదు అత్యుత్తమ ప్రాజెక్టులనుంచి ఐటీయూ నిపుణుల బృందం చేత ప్రాజెక్టు విజేత ఎంపిక 5) 2023 డబ్ల్యు ఎస్ ఐ ఎస్ ఫోరం వేడుకలలో బహిరంగంగా విజేత ప్రకటన.

ఒక్కో దశలోనూ పద్ధతి ప్రకారం ప్రక్రియ పూర్తయ్యాక ఆడిట్ ఆన్ లైన్ కు 2023 సంవత్సరపు పురస్కారం లభించింది. స్విట్జర్లాండ్ లో జెనీవాలో 2023 మార్చి 14 న సెంటర్ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్, జెనీవా ( స ఐ సి జి) లో బహుమతి ప్రదానోత్సవం జరిగింది. ఎన్ ఐ సి లో పంచాయత్ ఇన్ఫర్మాటిక్స్ డివిజన్ డీడీజీ శ్రీ సునీల్ జైన్ ఈ పురస్కారం అందుకున్నారు.

ఐక్యరాజ్య సమితికి అనుబంధంగా ఉండే అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్, ఐక్యరాజ్యసమితి సమన్వయంతో ఈ డబ్ల్యు ఎస్ ఐ ఎస్ పురస్కార ప్రదానోత్సవం ఏటా జరిగే కార్యక్రమం. దీనికి యునెస్కో, యూ ఎన్ డీపీ, యూఎన్ సి టి ఏడీ కూడా సహకరిస్తాయి. ఐక్యరాజ్యసమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించటానికి ఐసీటీని వాడుకోవటం వీటి లక్ష్యం.

సువిశాలమైన దేశంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు అనేక ప్రాథమిక సౌకర్యాలు కల్పించటంలో పంచాయితీ రాజ్ సంస్థలు చాలా కీలకమైన పాత్ర పోషిస్తాయి. అందుకే పంచాయితీరాజ్ సంస్థలకు తగిన మౌలిక సదుపాయాలు, తగిన శిక్షణ పొందిన సిబ్బంది ఎంతో అవసరం. పంచాయితీరాజ్ సంస్థలు అందించే వివిధ సేవలను అందించటానికి కేంద్ర ఆర్థిక సంఘాలు నిర్దేశించిన గ్రాంట్లను కేంద్రం నిరాటంకంగా పంచాయితీరాజ్ సంస్థలకు ఇస్తూనే ఉంటుంది. వాటిలో దేశ వ్యాప్తంగా ఉన్న సంప్రదాయ స్థానిక సంస్థలు కూడా ఉన్నాయి. అందువలన ఈ సంస్థల పనితీరును అనుక్షణం పర్యవేక్షించవలసిన అవసరముంది. అప్పుడే ప్రజాధనం అభివృద్ధి పనులకోసం సద్వినియోగం కావటానికి, పారదర్శకతకు వీలుంటుంది. వాటి పనితీరు బాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో ఉండేట్టు చూడటానికి కూడా ఇది అవసరం.

పంచాయితీరాజ్ మంత్రిత్వశాఖ ఈ ఆలోచనతోనే ఎప్పటికప్పుడు డిజిటల్ టెక్నాలజీని తనకు అవసరమైన అన్నీ చోట్లా వాడుకుంటూ గ్రామీణ ప్రాంతాల్లో సుపరిపాలన అందిస్తూ పారదర్శకతను, జవాబుదారీతనాన్ని ప్రదర్శిస్తోంది. అదే విధంగా ఆద్యంతం ప్రజాసేవలు అందించగలుగుతోంది.

కేంద్ర ఆర్థిక సంఘం పదే పదే పంచాయితీల ఖాతాలు ఆడిట్ చేసి అందుబాటులో ఉంచాలని కోరుతోంది. 15 వ ఆర్థిక సంఘం మరీ ముఖ్యంగా సంస్కరణలు సూచిస్తూ, ఆడిట్ కు ముందూ, తరువాతా ఖాతాలను ఆన్ లైన్ లో అందుబాటులో ఉంచాలని నిర్దేశించింది. ఈ సంస్థాగత సంస్కరణకు సమాధానంగా పంచాయితీరాజ్ మంత్రిత్వశాఖ 2020 ఏప్రిల్ 15 న ఆడిట్ ఆన్ లైన్ యాప్ ను ప్రారంభించింది. దీనివల్ల ఖాతాలను ఆన్ లైన్ లో ఆడిట్ చేయటంతో బాటు పంచాయితీల ఆర్థిక లావాదేవీలను మరింత పారదర్శకంగా నిర్వహించటానికి వీలవుతుంది. ఆయా రాష్ట్రాల ఆడిట్ చట్టాలకూ, నిబంధనలకూ అనుగుణంగా సర్దుబాటు చేసుకోగలగటం ఈ యాప్ ప్రత్యేకత.

# స్టార్టప్20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్ సిక్కింలో సమావేశం కానుంది

న్యూఢిల్లీ, మార్చి 18:భారతదేశం జీ 20 ప్రెసిడెన్సీలో కొత్తగా ఏర్పడిన స్టార్టప్20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్ యొక్క రెండవ సమావేశం 18 - 19 మార్చి 2023న సిక్కింలోని గాంగ్‌టక్‌లో జరుగుతుంది. ఈ సమావేశం ఉ20 సభ్యులు మరియు ఆహ్వానిత దేశాల నుండి ప్రతినిధులను, బహుపాక్షిక సంస్థల ప్రతినిధులు మరియు భారతీయ స్టార్టప్ పర్యావరణ వ్యవస్థ లబ్దిదారులను ఆహ్వానిస్తుంది.

స్టార్టప్ 20 చైర్ డాక్టర్ చింతన్ వైష్ణవ్ మాట్లాడుతూ, "స్టార్టప్ ప్రపంచాన్ని భారతదేశంలోని నిర్మలమైన ఈశాన్య ప్రాంతానికి తీసుకురావడానికి మరియు దాని ప్రత్యేకమైన మరియు పెరుగుతున్న స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను ప్రదర్శించడానికి సిక్కిం సభ ఒక విశిష్ట అవకాశాన్ని అందిస్తుంది."

2023 జనవరి 28 - 29 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగిన ప్రారంభ సమావేశంలో ఖరారు చేసిన ఎజెండాను హాజరైన ప్రతినిధులందరి మద్దతుతో సిక్కిం సభ ముందుకు తీసుకుపోతుంది. ప్రారంభ సమావేశంలో, స్థాపన మరియు సంబంధాలు, ఫైనాన్స్, మరియు సమ్మిళితం మరియు సుస్థిరత అనే మూడు టాస్క్‌ఫోర్స్‌లకు సంబంధించిన లక్ష్యాలు మరియు ఉత్పాదనలు రూపొందించడానికి ప్రతినిధులందరి నుండి వచ్చిన సూచనలను పొందుపరుస్తారు.

స్థాపన మరియు సంబంధాలు (ఫౌండేషన్ మరియు అలయన్స్) టాస్క్‌ఫోర్స్ ఏకాభిప్రాయం ఆధారిత నిర్వచనాల ద్వారా ప్రపంచ స్టార్టప్ వ్యవస్థను సమన్వయం చేయడానికి పని చేస్తుంది. ఇది స్టార్టప్‌ల కోసం ప్రపంచ విజ్ఞాన సంచయం /హబ్‌ను ఏర్పాటు చేస్తుంది. ఇది జీ 20 దేశాలలో అత్యుత్తమ అభ్యాసాలను ప్రదర్శించడానికి భాగస్వామ్యం చేస్తుంది. టాస్క్‌ఫోర్స్ ప్రభుత్వాలు, విధాన రూపకర్తలు, విద్యా-పరిశోధనా సంస్థలు, పరిశ్రమ సంఘాలు మరియు ఎస్ డీ జీ లపై దృష్టి సారించే స్టార్టప్‌లతో సహా అంతర్జాతీయ సంస్థలతో ద్వైపాక్షిక మరియు బహుపాక్షిక సహకారాన్ని కూడా సృష్టిస్తుంది. చివరగా, ఇది జీ 20 దేశాలలో పనిచేస్తున్న స్టార్టప్‌ల కోసం మార్కెట్‌లను మరియు ప్రపంచవ్యాప్త ప్రతిభ ప్రాప్యత లభ్యత కోసం వ్యవస్థలను సృష్టిస్తుంది. స్టార్టప్‌లతో కలిసి పనిచేయడానికి పరిశ్రమ మరియు ప్రభుత్వ సంస్థలకు సహాయక విధానాలను సిఫార్సు చేస్తుంది.

స్టార్టప్‌లకు అందుబాటులో ఉన్న ఆర్థిక సాధనాల శ్రేణిని విస్తృతం చేయడానికి ప్రత్యేకంగా ఆర్థిక సహకారం మరియు పెట్టుబడి ప్లాట్‌ఫారమ్‌లను అందించడం ద్వారా స్టార్టప్‌లకు మూలధనానికి ప్రాప్యతను లభ్యతను పెంచడం ఆర్థిక సహకారం టాస్క్‌ఫోర్స్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇది మూలదనేతర పెట్టుబడి ఆధారిత ఆర్థిక ఉత్పత్తుల ద్వారా సకాలంలో ఖాయిలా మూలధనం సులభంగా లభ్యం అయ్యేటట్లు చేస్తుంది . ప్రాధాన్యతా రంగాలకు నిర్దిష్ట మొత్తాన్ని కేటాయిస్తుంది. స్టార్టప్ ఫండింగ్‌లో ప్రభుత్వ పెట్టుబడి ని ప్రోత్సహించడానికి మరియు జీ 20 దేశాల విదేశీ పెట్టుబడిదారుల పర్యావరణ వ్యవస్థతో పరస్పర అనుసంధానం చేయడానికి, పన్ను విధాన రూపకల్పన మరియు స్టార్టప్ ఫండింగ్ కు అనుకూల చట్టపరమైన నిబంధనలను కూడా టాస్క్‌ఫోర్స్ సమన్వయం చేస్తుంది. చివరగా, స్టార్టప్ పెట్టుబడులపై ఉత్తమ విధానాల డాక్యుమెంట్ ద్వారా ప్రపంచ ఇన్వెస్టర్ కమ్యూనిటీతో స్టార్టప్‌ల కోసం నిధుల అభ్యర్థనలు, సామర్థ్య నిర్మాణం మరియు నెట్‌వర్కింగ్ అవకాశాలను ఇది సృష్టిస్తుంది.

మహిళలు, వికలాంగులు, ఎల్‌జిబిటిక్యూ+, మైనారిటీలు, ఇతర సమూహాల నేతృత్వంలోని స్టార్టప్‌లు/ పారిశ్రామికవేత్తల నిర్దిష్ట అవసరాలను సమ్మిళితం మరియు సుస్థిరత టాస్క్‌ఫోర్స్ గుర్తిస్తుంది. మార్కెట్, ఆర్థిక వనరులు, శిక్షణ మరియు ప్రభుత్వ నేతృత్వంలోని సహాయ ప్రోత్సాహ పథకాలలను అందచేయడం ద్వారా వారికి మద్దతు ఇవ్వడం, టెక్నాలజీలు (ఉదా., సహాయక సాంకేతికత.) వెనుకబడిన ప్రపంచాన్ని మరింత కలుపుకొని పోయేందుకు స్టార్టప్‌లను ప్రోత్సహించడం ఈ టాస్క్‌ఫోర్స్ లక్ష్యం. కేంద్రీకత పెట్టుబడులు, అనువైన వాతారణాన్ని కల్పించడం మరియు మార్గనిర్దేశ సహకారం, పరస్పర మార్కెట్ ప్రవేశం, పర్యవేక్షణ వ్యవస్థ ఎస్ డి జీ ల కోసం పనిచేసే స్టార్టప్‌ల ప్రోత్సాహం మొదలైనవాటిలో టాస్క్‌ఫోర్స్ ప్రోత్సహిస్తుంది/మద్దతు ఇస్తుంది. స్టార్టప్‌లు వారి దీర్ఘకాలిక లాభదాయకత కోసం స్థిరమైన వ్యాపార నమూనాలను అనుసరించేలా ప్రోత్సహిస్తుంది.

సిక్కిం సభలో, స్టార్టప్20 ఎంగేజ్‌మెంట్ గ్రూప్‌లోని టాస్క్‌ఫోర్స్ సభ్యులు (జీ 20 దేశాలకు చెందిన ప్రతినిధులతో కూడినది) అధికారిక విధాన ప్రకటన యొక్క మొదటి ముసాయిదాపై చర్చిస్తారు. ఈవెంట్‌లో వివిధ అంశాలు స్టార్టప్20ఎక్స్, ఎంజి మార్గ్‌లో స్టార్టప్‌ల ప్రదర్శన మరియు ప్రతినిధులు రుమ్‌టెక్ మొనాస్టరీ సందర్శన వంటి ఈవెంట్‌లు కార్యక్రమాలు కూడా జరిగాయి.

విధాన ప్రకటన యొక్క మొదటి ముసాయిదా రాబోయే నెలల్లో రూపొందించబడుతుంది తిరిగి చర్చించబడుతుంది. స్టార్టప్ 20 లో భాగంగా జరిగే ఇతర మధ్యవర్తిత్వ ఈవెంట్‌లు, స్టార్టప్ 20 యొక్క ఆశించిన ఫలితాలు అధికారిక పాలసీ కమ్యూనిక్, సాధారణంగా అంగీకరించబడిన నిర్వచనాలు మరియు పరిభాషల పదకోశం సెట్‌తో కూడిన స్టార్టప్ హ్యాండ్‌బుక్, సరిహద్దులఅవల అంతటా సహకారాన్ని పెంపొందించడానికి గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ మరియు స్టార్టప్ ప్రపంచ పర్యావరణ వ్యవస్థల కోసం ప్రపంచ సమన్వయ కేంద్రం ఏర్పాటు చేయడం వంటివి స్టార్టప్ 20 కార్యకలాపాలు.

# అస్సాం రాష్ట్రంలోని జిల్లాల మధ్య పరిశుభ్రతపై స్వచ్ఛతాపోటీలు

## -విజేతగా నిలిచిన జిల్లాకు వంద కోట్ల రూపాయల నగదు

డిస్‌పూర్ మార్చ్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: అస్సాంముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మసంచలన ప్రకటన చేశారు. అస్సాం రాష్ట్రంలోని జిల్లాల మధ్యపరిశుభ్రతపై స్వచ్ఛతాపోటీలు పెట్టనున్నారు. కాంపిటీషన్‌లో విజేతగా నిలిచిన జిల్లాకు వంద కోట్ల రూపాయల నగదు బహుమతి ప్రకటించనున్నారు. జిల్లా అభివృద్ధి కోసం ఆ నిధులు ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించారు. అంతేకాదు ఖుమ్‌తాయ్నియోజకవర్గంలోని జడ్‌పీసీ ప్రాంతంలోని గ్రామాల మధ్య, టీ గార్డెన్‌ల మధ్య కూడా స్వచ్ఛతకు సంబంధించిన పోటీ ప్రకటించారు. ఈ పోటీల ద్వారా అస్సాం దేశంలోనే అత్యంత పరిశుభ్రంగా ఉండే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. స్వచ్ఛతా పోటీలపై బ్లూ ప్రింట్ కూడా విడుదల చేయనున్నారు. స్వచ్ఛతా పోటీల ద్వారా పర్యాటకంగా కూడా తమ రాష్ట్రానికి మేలు చేకూరుతుందని శర్మ చెబుతున్నారు. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చాక ప్రధానమంత్రి నరేంద్ర మోదీస్వచ్ఛ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పటికే రాష్ట్రాల మధ్య, నగరాల పోటీ పెట్టి పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తున్నారు. స్వచ్ఛభారత్ ఉద్యమంపై అన్ని రాష్ట్రాల్లోనూ అవగాహన పెరిగింది.

# హోం మంత్రి అమిత్ షాను కలిసిన చిరంజీవి



న్యూఢిల్లీ మార్చ్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్): సినిమాలోని నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డ్ వచ్చిన వేళ మెగాస్టార్ చిరంజీవి మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌లు హోం మంత్రి అమిత్ షాను ఢిల్లీలో కలిశారు. ఈ సమయంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన బీజేపీ ఎంపీలు కూడా అక్కడే ఉన్నారు. అనంతరం షా తో చిరు, చెర్రీ భేటీ అయ్యారు. రామ్ చరణ్‌ను అభినందించి ఆశీస్సులు అందజేయడంపై చిరంజీవి అమిత్ షాకు ధన్యవాదాలు చెప్పారు. 95వ అకాడమీ అవార్డ్స్ లో జక్కన్న చెక్కిన 'ఆర్ఆర్ఆర్' చిత్రంలోని 'నాటు నాటు' పాట బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో ఆస్కార్ అవార్డును కైవసం చేసుకున్న వేళ మరో ఘనతను సాధించిం

# సీఎం జగన్‌ను కలిసిన నూతన ఎమ్మెల్సీలు..

అమరావతి, మార్చి 18:వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఘన విజయం సాధించిన నూతన ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీలోని సీఎం కార్యాలయంలో నూతన ఎమ్మెల్సీలుగా ఎన్నికైన నర్తు రామారావు, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ సీఎం వైయస్ జగన్‌ను కలిశారు. ఈ మేరకు నూతన ఎమ్మెల్సీలను ముఖ్యమంత్రి వైయస్ జగన్ అభినందించారు. శాసనమండలి సభ్యులుగా తమకు అవకాశం కల్పించిన సీఎంకు నూతన ఎమ్మెల్సీలు కృతజ్ఞతలు తెలిపారు. నూతన ఎమ్మెల్సీలతో పాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రి వైయస్ జగన్‌ను కలిశారు.






# ఎన్ టిపిసి గ్రీన్ ఎనర్జి లిమిటెడ్ లో నిర్ణీత పరిమితికి మించి పెట్టుబడులు పెట్టడానికి మహారత్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు ఆమోదం తెలిపిన మంత్రివర్గం

న్యూఢిల్లీ, మార్చి 18:ఎన్ టిపిసి లిమిటెడ్ అనుబంధ సంస్థ అయిన ఎన్ టిపిసి గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ లో నిర్ణీత పరిమితికి మించి పెట్టుబడులు పెట్టడానికి కేంద్ర ప్రభుత్వ మహారత్న రంగ సంస్థలకు అధికార బదలాయిం పు ప్రస్తుత మార్గదర్శకాల నుంచి ఎన్ టిపిసి లిమిటెడ్ కు మినహాయింపు ఇవ్వాలన్న ప్రతిపాదనకు ఈ రోజు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశం అయిన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ ఆమోదం తెలిపింది. పునరుత్పాదక శక్తి సామర్థ్య లక్ష్యాన్ని సాధించడానికి ఎన్ టిపిసి 60 గిగావాట్ల సామర్థ్యంతో నెలకొల్పనున్న యూనిట్ లో రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ ( ఎన్‌ఆర్‌ఈఎల్ )లో ఎన్ జీఈఎల్ దాని ఇతర జేవీ లు/అనుబంధ సంస్థలు తమ నికర విలువలో 15% గరిష్ట స్థాయికి లోబడి రూ. 5,000 కోట్ల నుంచి రూ. 7,500 కోట్లు వరకు పెట్టుబడి పెట్టడానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

కాప్ 26 లో అంగీకరించిన విధంగా కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి భారతదేశం ప్రయత్నాలు చేస్తూ లక్ష్యాన్ని సాధించడానికి కృషి సాగిస్తోంది. శిలాజేతర ఇంధన వనరులను ఉపయోగించి 2030 నాటికి 500 60 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని భారతదేశం లక్ష్యంగా నిర్ణయించుకుంది.

దేశ విద్యుత్ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ టిపిసి తన పునరుత్పాదక శక్తి సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించింది. నూతన పెట్టుబడులు వినియోగించి 60 గిగావాట్ల సామర్థ్యంతో పునరుత్పాదక ఇంధన వనరులు ఉపయోగించి పనిచేసే విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని స్థాపిస్తుంది. దీనివల్ల 2030 నాటికి 500 60 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలన్న భారతదేశం నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి అవకాశం కలుగుతుంది. 2070 నాటికి శూన్య ఉద్గారాల విడుదల స్థాయికి చేరుకోవడానికి ఎన్ టిపిసి ప్రణాళిక సహకరిస్తుంది.

ఇటీవల జరిగిన కాప్ 26 సదస్సులో 'పంచమిత్ర' విధానం అమలు చేసి శూన్య ఉద్గార విడుదల స్థాయికి చేరుకుంటామని భారతదేశం ప్రకటించింది. దీనికి అనుగుణంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. పునరుత్పాదక ఇంధన రంగంలో ఎన్ టిపిసి రూపొందించిన ప్రణాళికను ఎన్ జీఈఎల్ అమలు చేస్తుంది. ప్రస్తుతం ఎన్ జీఈఎల్ పనిచేస్తున్న/ నిర్మాణం పూర్తి కావడానికి సిద్ధంగా ఉన్న 15 పునరుత్పాదక కేంద్రాలు, ఎన్‌ఆర్‌ఈఎల్ ద్వారా 2,861 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తోంది. గ్రీన్ ఎనర్జీ రంగంలో అందుబాటులో ఉన్న అవకాశాలు ఉపయోగించుకోవడానికి ఎన్‌ఆర్‌ఈఎల్ పోటీ రంగంలో ప్రవేశించి సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి ప్రణాళిక రూపొందించింది. ఎన్ టిపిసి కి ప్రభుత్వం ఇచ్చిన మినహాయింపులు ప్రపంచ గ్రీన్ ఎనర్జీ రంగంలో భారతదేశం కీలక పాత్ర పోషించడానికి సహకరిస్తాయి. సాంప్రదాయ ఇంధన వనరుల వినియోగం తగ్గుతుంది. బొగ్గు దిగుమతి కోసం చేస్తున్న వ్యయం గణనీయంగా తగ్గుతుంది. దేశంలో ప్రతి ప్రాంతంలో 24 గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.

ఎన్ టిపిసి నెలకొల్పనున్న పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు నిర్మాణ దశ, పని ఉత్పత్తి ప్రారంభించిన తర్వాత వెలది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలను అందిస్తుంది.

# టిడ్కో ఇళ్లకు తాళాలు .. ఎమ్మెల్యే నిమ్మల నిరసన..

అమరావతి, మార్చి 18:ఎన్టీఆర్ టిడ్కో ఇళ్ళకు నాలుగేళ్లుగా తాళాలు ఎందుకు వేసారంటూ ప్లకార్డుతో అసెంబ్లీ వెలుపల నిలువ కాళ్లపై నిలబడి టీడీపీ ఎమ్మెల్యే డా.నిమ్మల రామానాయుడు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్టిన ఇళ్లకు రంగులు కాదు.. మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నాడు ఉచితమని చెప్పి, నేడు టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులను బ్యాంకులకు జగన్ తాకట్టు పెడుతున్నాడన్నారు. నాలుగేళ్లలో ఒక్క అరబస్తా సిమెంట్ వాడకుండా, ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా టిడ్కో ఇళ్ళ లబ్ధిదారులపై జగన్ కక్ష సాధిస్తున్నాడని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఆరోపించారు.

# జాతీయ హోదా కోరలేదని అనడం సరికాదు : బోయినపల్లి వినోద్ కుమార్



రాజన్న సిరిసిల్ల, మార్చి 18: (నేటినిజం ప్రతినిధి): : తెలంగాణ ప్రభుత్వం నిర్మించిన నీటి పారుదల ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించాలని కోరినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపట్టించుకోవడం లేదని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడుబోయినపల్లి వినోద్ కుమార్ కేంద్రంపై మండిపడ్డారు. జాతీయ హోదా కోరలేదని పార్లమెంట్‌లో కేంద్ర జలవనరుల శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు.రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతు కుంట మండలంలో ఆయన మీడి యా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం జాతీయ హోదా ఏనాడు కోరలేదని అనడం సరికాదని పేర్కొన్నారు. నీళ్లు ,నిధులు ,నియా మకాలు సాధించుకోవడం కోసమే తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం జరిగిందని స్పష్టం చేశారు. నాడు నీటి పారుదల మంత్రి గా ఉన్న హరీశ్‌రావు పలుమార్లు కేంద్రంలోని మంత్రులకు జాతీయ హోదా కోసం లిఖితపూర్వకంగా దరఖాస్తులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ స్పందించి ఇప్పటికైనా కేంద్ర మంత్రితో జాతీయ హోదాపై సమాధానం ఇప్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజనలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టుకు మాత్రమే జాతీయ హోదా కల్పించిందని పేర్కొన్నారు.

# ఇంటర్ పరీక్షలు నాల్గవ రోజు పరీక్షలు ప్రశాంతం.

సంగారెడ్డి, మార్చి 18 (నేటి నిజం ప్రతినిధి) ఇంటర్ పరీక్షల్లో భాగంగా శనివారం ఇంటర్ సెకండ్ ఇయర్ ఇంగ్లీష్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్ శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.

ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ ఇంగ్లీష్ పరీక్షకు జిల్లాలో 96.90 శాతం అభ్యర్థులు హాజరైనట్లు తెలిపారు.

మొత్తం 15,559 మంది విద్యార్థులకు గాను 15,076 మంది విద్యార్థులు హాజరయ్యారని, 483 మంది గైరాజరైనట్లు తెలిపారు.

డి ఇ సి మెంబర్లు 5 పరీక్షా కేంద్రాలను, హెచ్ పి సి సభ్యులు 4 , ఫ్లయింగ్ స్క్వాడ్స్ 10, సిట్టింగ్స్ స్క్వాడ్స్ 4 కేంద్రాలను, డి ఐ ఈ ఓ 4 కేంద్రాలను సందర్శించారని తెలిపారు.

# లాభసాటి పంటలు పండేలా రైతులను ప్రోత్సహించాలి.. మార్కెట్ కమిటీలకు మంత్రి ఈశ్వర్ సూచన

జగిత్యాల జిల్లా, మార్చి 18: మార్కెట్ కమిటీలు రైతులకు సేవ చేస్తూ అండగా ఉండాలని, లాభసాటి పంటలు సాగేచేసేలా రైతులను ప్రోత్సహించాలని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లోక నిర్మలా మల్లారెడ్డితో పాటు సభ్యుస్రమాణం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీలు రైతులకు సేవ చేయడానికి తప్ప రాజకీయాలు చేసేందుకు కాదన్నారు.

తెలంగాణ రాష్ట్రం రాకముందు వ్యవసాయ మార్కెట్ కమిటీల ఏర్పాటులో రిజర్వేషన్ లేదని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం దేశానికే



ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కేసీఆర్ రైతులకు పెట్టుబడి సాయంగా రైతుబంధుతో పాటు రైతుబీమా రైతు కుటుంబానికి ధీమా కల్పించడంతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టుతో పంటలకు సాగునీరందిస్తున్నారన్నారు. అయోమయంలో ఉన్న రైతాంగానికి చేయూతనిచ్చేందుకు సీఎం ధాన్యం కొనుగోలుకు నిర్ణయం తీసుకున్నారని, కేంద్రం సహకరించకున్నా రైతులను ఆదుకోవాలన్న సంకల్పంతోనే కొనుగోలు చేస్తున్నారన్నారు.

రాష్ట్రంలో వరి ధాన్యం కొనుగోలు ద్వారా సుమారుగా రూ.1200కోట్ల నష్టం వస్తుందని తెలిసి.. రైతుల కోసం పరితపించే సీఎం కేసీఆర్ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఇంటికి ఏదో ఒక రకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఆసరా పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, వైకుంఠధామాలు.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా పథకాలే ఉన్నాయన్నారు.

పెన్షన్లు, డబుల్ బెడ్ రూం ఇండ్లు, రైతుబంధు, మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు, 24 గంటల ఉచిత కరెంటు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలు బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఉన్నాయని ప్రశ్నించారు. అధికారం ఉన్న రాష్ట్రాల్లో పథకాలు అమలు చేయడం చేతకాదని, నోరు, మైకులు ఉన్నాయని ఇష్టానుసారంగా మాట్లాడితే ఊరుకునేది లేదని మంత్రి హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్, ఓరుగంటి రమణారావు తదితరులు పాల్గొన్నారు.

# 24 గంటలలో మహిళను హత్య కేసుని చేదించిన జిల్లా పోలిసులు.

## – సిబ్బందిని అభినందించిన జిల్లా యస్పి రమణ కుమార్.



సంగారెడ్డి మార్చి 18 (నేటి నిజం ప్రతినిధి) సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్ సాగర్ చెరువులో గురువారము నాడు లభ్యమైన గుర్తు తెలియని మహిళ మృతదేహం కేసును సంగారెడ్డి జిల్లా పోలీసులు 24 గంటలలో చేధించారు. పోలీసుల సమాచారం మేరకు లభ్యమైన మృతదేహం కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాకి చెందిన వడ్డెర కవిత (28 సం॥) గా గుర్తించారు . నిందితుడు పొడ్డిమల్ గ్రామము, కోహీర్ మండలానికి చెందిన మంగలి కృష్ణయ్య గా గుర్తించారు. కేసు వివరాల మేరకు , భర్త నుండి వేరుగా బ్రతకడానికి సంగారెడ్డి కి వచ్చిన కవిత గత నెల రోజుల క్రింద నిందు కృష్ణయ్య తో పరిచయం ఏర్పడింది . అప్పటి నుండి ఇద్దరు కలిసి సంగారెడ్డి పట్టణము లోని రామ్ నగర్ కాలనీలో ఒకటే రూమ్ లో వుండేవారు. ఈ నెల 12 న రాత్రి నిందుతుడు కటింగ్ షాప్ లో పని చేసి రాత్రి ఇంటికి వచ్చినాడు. రాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చిన కవితతో అక్రమ సంబంధం విషయంగా ఇద్దరి మధ్య గొడవ జరగగా నిందుతుడుకి కోపం వచ్చి చెయ్యితో గట్టిగా ఆమె తలపై బలంగా కొట్టగా, ఆమె స్పృహ తప్పి పడిపోయింది . నేరస్థుడు ఆమె తలను బలంగా నేలకు కొట్టి ఆమె గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఆమె చనిపోయినది అని నిర్ధారించుకున్న నిందితుడు , మృతురాలి చేతులు, కాళ్ళను, తలను ఒక్క దగ్గరకు ఆమె చున్నితో చుట్టి కట్టేసి గోనె సంచిలో కుక్కి, అదే రోజు మధ్య రాత్రి బుజాలపై ఎత్తుకొని రూమ్ నుండి కిందికి దింపి, మహబూబ్ సాగర్ చెరువు ఒడ్డున పడవేసి, మళ్ళీ అదే దారిలో ఇంటికి వచ్చినట్లు విచారణలో నిందితుడు తెలిపినట్టు పోలిసులు మీడియా సమావేశంలో తెలిపారు. శనివారము నాడు ఉదయం పూర్తి ఆధారాలతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కి పంపినట్లు పోలిసులు తెలిపారు. 24 గంటలలో నేరం ను చేదించిన సంగారెడ్డి టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీదర్ రెడ్డి , డిఎస్పీ రవేందర్ రెడ్డి సిబ్బందిని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రమణ కుమార్ అభినందించారు.

# బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు చేరిక

సూర్యాపేట, మార్చి 18: ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్శితులై పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు , ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీ(ఃఖీూ)లో చేరుతున్నారు. తాజాగా కాంగ్రెస్(అనీనిణతీవబబ)కు చెందిన సూర్యాపేట జిల్లా(రాబీతీఎజీజూవబిజీ ఆతిబబితీతిఇబి) తిరుమలగిరి మండలం తొండ గ్రామ సర్పంచ్ నెమరుగొమ్ముల శాతవాహన రావు, ఉప సర్పంచ్ వెంకన్న, గ్రామ పార్టీ అధ్యక్షుడు రామారావు, మాజీ ఎంపీటీసీ రామనుజయ్య తదితరులు ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ సమక్షంలో చేరారు.

వీరితో పాటు వార్డు మెంబర్లు కొమురెల్లి రజిత లింగయ్య, ఉపేంద్ర చంద్రు, జ్యోతి చంద్రయ్య, నరసయ్య, స్వప్నఅనిల్, ఖమ్మంపాటి ఎల్లయ్య, గౌడ సంఘం అధ్యక్షులు కొండ సాయిమల్లు, ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు వేల్పుల ఎల్లయ్య, నాయకులు లోడే సాయి, నీరటి వెంకన్న, మధు, రవి, రాజు, అంజయ్య, సత్తయ్యతో పాటు మరో 500 మంది నాయకులు చేరారు. ఈ సందర్భంగా వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం శరవేగంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్ రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సంకేపల్లి రఘునందన్ రెడ్డి, ఎంపీపీ నెమరుగొమ్ముల స్నేహలత, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీశ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ దూపటి రవీందర్, గోపాల్ రెడ్డి, మల్లయ్య, రజనీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూమిలోకి కుంగిన స్కూల్.. 17 మంది విద్యార్థులకు గాయాలు



హరారే: ఒక స్కూల్‌లోని క్లాస్‌రూమ్ భూమిలోకి (రాఇఃష్టనీనీశ్రీ బతినిని) కుంగింది. దీంతో ఆ తరగతి గదిలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో 17 మంది గాయపడ్డారు. జింబాబ్వేలో ఈ సంఘటన జరిగింది. ఆ దేశ రాజధాని హరారేకు 200 కిలోమీటర్ల దూరంలో ఉన్న క్వెక్వేలో ఒక ప్రాథమిక పాఠశాల ఉంది. అయితే ఈ స్కూల్ సమీపంలో రెండు బంగారు గనులు ఉన్నాయి. ఆ గనుల్లో అక్రమ తవ్వకాల ప్రభావం ఆ స్కూల్‌పై పడింది. దీంతో గురువారం ఉన్నట్టుండి స్కూల్‌లోని ఒక క్లాస్‌రూమ్ భూమిలోకి కుంగిపోయింది. తరగతి గదిలో పెద్ద గొయ్యి ఏర్పడింది. బెంచీలపై కూర్చొన్న విద్యార్థులు వాటితో సహా ఆ గోతిలో పడ్డారు. దీంతో పది నుంచి 11 ఏళ్ల మధ్య వయసున్న 17 మంది విద్యార్థులు గాయపడ్డారు. ఒక బాలిక తీవ్రంగా గాయపడటంతో వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు.

కాగా, ఈ సమాచారం తెలిసిన వెంటనే స్థానిక ఎంపీ జుడిత్ తోబైవా ఆ స్కూల్‌ను సందర్శించారు. సమీపంలో ఉన్న బంగారు గనుల్లో అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై ఆందోళన వ్యక్తం చేశారు. తవ్వకాల వల్ల స్కూల్ కుంగిపోతున్నదని ఆమె తెలిపారు. తరగతి గది నేల, బెంచీలు భూమిలోకి కుంగిన ఫొటోలను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఇంకా పేలుళ్లు కొనసాగుతున్నాయిని, ఈ ప్రాంతం ఊగిపోతున్నదని పేర్కొన్నారు. ఈ సంఘటనపై వేగంగా స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఆమె కోరారు.

మరోవైపు స్కూల్ కుంగిన సంఘటనపై చాలాగ్రాంతి చెందినట్లు ప్రాంతీయ వ్యవహారాల మంత్రి లారీ మావిమా తెలిపారు. ఈ ప్రమాదాన్ని నివారించేందుకు మైనర్లు ఎలాంటి సురక్షితమైన చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ప్రమాదకరంగా మారిన ఆ స్కూల్‌ను మూసి వేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. విద్యార్థుల చదువు కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

# అధికార లాంఛనాలతో కల్నల్ వీవీబీ రెడ్డి అంత్యక్రియలు పూర్తి

యాదగిరిగుట్ట, మార్చి 18: అరుణాచల్ ప్రదేశ్ హెలికాప్టర్ దుర్ఘటనలో మృతి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ వుప్పల వినయ్ భాను రెడ్డి అంత్యక్రియలు శనివారం అధికార లాంఛనాలతో పూర్తయ్యాయి. కల్నల్ స్వగ్రామమైన యాదగిరి గుట్ట జిల్లా బొమ్మలరామారానికి చేరుకున్న వీవీబీ రెడ్డి భౌతికకాయం వద్ద రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సైనిక అధికారులు శ్రద్ధాంజలి ఘటించారు.

వీరితో పాటు స్థానిక శాసన సభ్యురాలు గొంగొడి సునీతామహేందర్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, యాదాద్రి జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, కలెక్టర్ పమేలాసత్పతి, రాచకొండ కమిషనర్ చౌహాన్, తదితరులు పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కల్నల్ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

సైనిక వాహనంపై భౌతికకాయం ఉంచి అంతిమయాత్రను నిర్వహించారు. ఈ ర్యాలీలో పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని నివాళులు అర్పించారు. మూడు కిలోమీటర్ల మేర బారులు తీరిన జనం కల్నల్ వినయ్ రెడ్డి అమర్ హై అంటూ నినాదాలు చేశారు.

# 'ఫెటల్ వింగ్స్ డయాగ్నోస్టిక్ సెంటర్' ను ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్, మార్చి 18: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గండి మైసమ్మ చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫెటల్ వింగ్స్ డయాగ్నోస్టిక్ సెంటర్ ను ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ లిమిటెడ్‌ను స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ చేసి సంస్థలో అదనపు నిధులు సేకరించడానికి ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 18:ఇండియన్ రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ లిమిటెడ్‌ను స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ చేసి సంస్థలో ప్రభుత్వం కలిగి ఉన్న వాటాలో కొంత భాగాన్ని తాజా ఈక్విటీ షేర్లు జారీ ద్వారా అదనపు నిధులు సేకరించడానికి ఐఆర్‌ఈడిఏ అనుమతి ఇవ్వాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు సమావేశం అయిన కేంద్ర మంత్రివర్గం ఆర్థిక వ్యవహారాల కమిటీ సమావేశం నిర్ణయించింది.

మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం వల్ల ఒక్కక్కటి 10 రూపాయల ముఖ విలువ కలిగిన 13.90 లక్షల ఈక్విటీ వాటాలను ఐపీవో ద్వారా విడుదల చేయడానికి 2017 జూన్ నెలలో ఐఆర్‌ఈడిఏ కి సీసీఏఏ ఇచ్చిన అనుమతి రద్దు అవుతుంది. కొత్తగా 1500 కోట్ల రూపాయల పెట్టుబడి సమీకరించాలని 2022 మార్చి నెలలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడానికి మూలధనం వ్యవస్థలో మార్పులు చేయాల్సిన అవసరం ఉండటంతో తాజా నిర్ణయం అమలు జరుగుతుంది.

మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం వల్ల ఐపీవో ద్వారా ప్రభుత్వ పెట్టుబడి విలువ పెరగడంతో పాటు జాతీయ అభివృద్ధిలో ప్రజలు వాటాల రూపంలో పాలుపంచుకుని లాభం పొందడానికి అవకాశం కలుగుతుంది. విస్తరణ కార్యక్రమాలకు అవసరమైన పెట్టుబడి కోసం ప్రజాధనాన్ని కాకుండా సొంత నిధులు ఉపయోగించడానికి ఐఆర్‌ఈడిఏ కి అవకాశం లభిస్తుంది. మార్కెట్ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పారదర్శకంగా నిధులు ఉపయోగించడానికి ఐఆర్‌ఈడిఏ కృషి చేస్తుంది.

ప్రభుత్వ రంగ సంస్థగా పనిచేస్తున్న ఐఆర్‌ఈడిఏ మినీ రత్న ( తరగతి–ఎ)గా గుర్తింపు పొందింది. 1987లో ఏర్పాటైన ఐఆర్‌ఈడిఏ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, ఇంధన సామర్థ్య సంస్థలకు అవసరమైన నిధులు అందిస్తుంది. ఆర్బీఐ లో నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సంస్థగా ఐఆర్‌ఈడిఏ నమోదయ్యింది.

వాతావరణ మార్పులపై కుదిరిన ప్యారిస్ ఒప్పందానికి అనుగుణంగా 2022 నాటికి 175 గిగావాట్ల విద్యుత్తును, 2030 నాటికి 500 గిగావాట్ల విద్యుత్తును పునరుత్పాదక ఇంధన వనరులను ఉపయోగించి ఉత్పత్తి చేయాలని భారతదేశం లక్ష్యంగా నిర్ణయించుకుంది. భారతదేశం నిర్ణయించుకున్న లక్ష్యాన్ని సాధించడానికి వాణిజ్య సరళిలో ఐఆర్‌ఈడిఏ అమలు చేసే ప్రాజెక్టుల వల్ల వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

# ఉగాది కళాసుధ పురస్కారాలు..




హైదరాబాద్, మార్చి 18:ఉగాది సందర్భంగా కళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో 25వ సిల్వర్ జూబ్లీ ఉగాది పురస్కారాలను అందించనుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు– చేసిన సమావేశంలో సంస్థ అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉగాది రోజున చెన్నైలో పురస్కారాల్ని అందజేయనున్నాం. ఈ సందర్భంగా ఎంపిక చేసిన 25 మంది అవార్డు గ్రహీతలకు వెండి మెమెంటోలు ప్రధానం చేయాలని నిర్ణయించాం. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ గవర్నర్ నరసింహన్, మండలి బుద్ధప్రసాద్, అలీ, పి.సుశీల, నిర్మాత రవిశంకర్ (మైత్రి మూవీస్) లాంటి ప్రముఖులు హాజరవుతున్నారు. ఉగాది రోజున చెన్నయ్ లోని మ్యూజిక్ అకాడమిలో ఈ వేడుక జరగనుంది అన్నారు. ఈ సమావేశంలో అతిథులుగా ప్రసన్నకు మార్, తుమ్మలపల్లి రామసత్యనా రాయణ , శ్రీనివాస్, పర్వతనేని రాం బాబు, మురళి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ భక్తులు టీఎస్ ఆర్టీసీని ఆదరించడం సంతోషం : చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

హైదరాబాద్, మార్చి 18:తెలంగాణ రాష్ట్రంలోని తిరుమల వెంకన్న భక్తులు, పర్యాటకులు టీఎస్ ఆర్టీసీ బస్సులను ఆదరించడం సంతోషంగా ఉందని ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. టీటీడీ భక్తులు, పర్యాటకులను దృష్టిలో ఉంచుకొని బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక చొరవ తీసుకొని టీటీడీ బోర్డు చైర్మన్ ఎస్వీ సుబ్బారెడ్డి సహాయ సహకారాలతో టీఎస్ ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే ప్రయాణికులకు టికెట్‌తో పాటు రూ. 300 ప్రత్యేక శీఘ్ర దర్శన టికెట్లను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ ఎనిమిది నెలల కాలంలో 1,14,565 ప్రయాణికులను విజయవంతంగా తిరుమల తిరుపతి వెంకన్న వద్దకు సురక్షితంగా ఆర్టీసీ బస్సుల్లో చేర్చడం చాలా సంతోషంగా ఉందని సంస్థ చైర్మన్ వెల్లడించారు.

తెలంగాణ నుంచి తిరుమల వెళ్లే టీటీడీ భక్తులు.. ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణించి, స్వామి వారిని దర్శించుకోవాలని సూచించారు. టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలనుకునే వారు వారం రోజుల ముందే రిజర్వేషన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో తిరుమల వెంకన్న వద్దకు ఈ యొక్క ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశామని చెప్పారు.

ప్రత్యేక ఆర్టీసీ బస్సుల్లో ప్రతిరోజు సుమారు 1000 మందిని తిరుమల వెంకన్న వద్దకు చేర్చడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే అప్ అండ్ డౌన్ టికెట్ సౌకర్యంతో పాటు దర్శనం కూడా కల్పించడం జరుగుతుందని తెలిపారు. టీఎస్ ఆర్టీసీ సంస్థ బస్సుల్లో ప్రయాణికులకు సురక్షితమైన, సుఖవంతమైన సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. తిరుమల తిరుపతి వెంకన్న చెంతకు వెళ్లే భక్తులు మరిన్ని వివరాల కోసం టీఎస్ ఆర్టీసీ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

# రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు అరెస్ట్ వారెంట్ జారీ

న్యూ డిల్లీ మార్చ్ 18 (ఎక్స్ ప్రెస్స్ న్యూ స్);ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగి లక్షలాదిమంది ప్రాణాలు బలిగొంటున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు షాక్.. ది హేగ్‌లోని ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) అతనిపై అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. 'ఉక్రెయిన్‌లో జరుగుతున్నయుద్ధానికి పుతిన్ బాధ్యుడు. అంతేకాదు ఆ దేశంలో ఆక్రమించుకున్న ప్రాంతాల నుంచి అక్కడి ప్రజలను.. ముఖ్యంగా పిల్లలను రష్యాకు అక్రమంగా తరలిస్తున్న యుద్ధ నేరస్థుడు పుతిన్' అంటూ ఐసీసీ తన అరెస్ట్ వారెంట్‌లో పేర్కొంది. ఉక్రెయిన్ పిల్లలను అక్రమంగా రష్యాకు తరలిస్తున్నందుకు రష్యా పిల్లల హక్కుల కమిషనర్ మరియా అలెక్సెఎవ్నా వోవా బెలోవాపై కూడా ఐసీసీ న్యాయమూర్తులు అరెస్ట్ వారెంట్ ఇచ్చారు. అంతేకాదు ఉక్రెయిన్‌లో జరుగుతున్న నరమేధానికి రష్యా అధ్యక్షుడే కారణం అనడానికి అనేక సాక్ష్యాలు ఉన్నాయని అంతర్జాతీయ న్యాయస్థానం తెలిపింది. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు మొదటగా పుతిన్, మరియాపై రహస్యంగా అరెస్ట్ వారెంట్ జారీ చేయాలనుకుంది. అయితే.. వాళ్లపై బహిరంగంగా అరెస్ట్ వారెంట్ ఇస్తే, మరిన్ని నేరాలను అదుపులో పెట్టవచ్చనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు న్యాయమూర్తులు వెల్లడించారు.

## స్వాగతించిన ఉక్రెయిన్

రష్యా విదేశాంగ శాక మీడియా ప్రతినిధి మరియా జఖరోవా మాత్రం అరెస్ట్ వారెంట్‌ను కొట్టిపారేశారు. 'అంతర్జాతీయ న్యాయస్థానం నిర్ణయం తమ దేశానికి ఏమాత్రం వర్తించదని, న్యాయపరంగానూ అది చెల్లద'ని మరియా తన టెలిగ్రామ్ ఛానెల్‌లో తెలిపారు. మరోవైపు ఉక్రెయిన్ అంతర్జాతీయ న్యాయస్థానం నిర్ణయాన్ని స్వాగతించింది. 'ఇది ఆరంభం మాత్రమే' అని ఉక్రెయిన్ అధ్యక్షుడి ముఖ్య అధికారి ఒకరు సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టారు. 2022 ఫిబ్రవరి 24 రష్యా, ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగిన విషయం తెలిసిందే. ఈ వార్ కారణంగా.. ఇరుదేశాలకు చెందిన సైనికులు లక్షల్లో ప్రాణాలు కోల్పోయారు. లక్షలాది మంది ఉక్రెయిన్ ప్రజలు ప్రాణాలు అరచేత పట్టుకుని పొరుగు దేశాలకు వలస వెళ్లారు.

# సనాతన ఆచారాలకు భిన్నంగా జరిగిన వివాహం అభినందనీయం



ఖమ్మం,మార్చి 18:(నేటినిజం ప్రతినిధి): మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్పి)ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు–నాగమణి దంపతుల కుమారుడు కరుణాకర్–మాళవికల వివాహం హరిత గార్డెన్స్ ఫంక్షన్ హాల్ ఖమ్మంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ, డాక్టర్ బాబురావు–డాక్టర్ జయల సమక్షంలో ఆచారాలకు భిన్నంగా మహాజన సంస్కృతిలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ కామేపల్లి మండల అధ్యక్షులు పాటిబండ్ల ప్రసాద్ మాదిగ, ఎల్ హెచ్ పి ఎస్ అధ్యక్షులు భూక్య నాగేంద్రబాబు నాయక్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, బంధువులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు 3016 రూపాయల నిరుద్యోగ భృతి ఇవ్వాలని సిఎం కేసీఆర్ కు లేఖ రాసిన ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సంగారెడ్డి మార్చి 18 (నేటి నిజం ప్రతినిధి) సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి 2018 టీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టో లో నిరుద్యోగులకు 3016 రూపాయల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చిన కేసిఆర్, కాంగ్రెస్ 2018 మేనిఫెస్టో లో 3000 నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటిస్తే..కేసీఆర్ ప్రభుత్వం 3016 ఇస్తామని మేనిఫెస్టో లో పెట్టిందని అయన వ్యాఖ్యానించారు. రెండొవసారి ప్రభుత్వం ఏర్పడి 4 ఏళ్లు అవుతున్న ఇంకా అమలు చేయలేదని అయన ఖండించారు. ఇంకో 8 నెలలు ఐతే ఎన్నికలు వస్తాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీ యే కాబ్బటి అమలు చేయాలనీ కోరుతున్నని అయన తెలిపారు. నిరుద్యోగ భృతి ఇస్తే నిరుద్యోగులకు ఎంతో కొంత ఆసరాగా ఉంటుందని అయన చెప్పారు. పేద, మధ్యతరగతి కుటుంబాల తల్లితండ్రులకు కూడ ఊరట ఇచ్చినవారు అవుతారుని అయన తెలిపారు. డిగ్రీ పూర్తి చేసుకొని ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నాలు చేస్తున్న వారికి 3016 ఉపయోగప డుతాయని ,తాత్కాలికంగా నిరుద్యోగుల ఖర్చులకు 3016 రూపాయలు ఉపయోగపడుతాయుని అయన చెప్పారు. ఈ అంశాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిం చినట్లు అయన చెప్పారు.మరొకసారి గుర్తు చేయడానికి మాత్రమే సిఎం గారికి లేఖ రాస్తున్నట్లు తెలిపారు. వెంటనే నిరుద్యోగుల కోసం 3016 రూపాయల నిరుద్యోగ భృతి ఇవ్వడానికి నిధులు విడుదల చేయాలని అయన సీఎం కి రాసిన లేఖలో కోరారు .

# సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, మార్చి 18:ప్రతి ఒక్కరూ సీపీఆర్(కార్డియోపల్మోనరీ రిసస్సిటేషన్)పై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి సత్వరమే సీపీఆర్ అందిస్తే వారి ప్రాణాలు కాపాడవచ్చని సూచించారు. వరంగల్ కలెక్టరెట్ కాన్ఫరెన్స్ హాల్ లో ఏర్పాటు చేసిన సీపీఆర్(అఖఖీ) శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటుగాని శ్వాస తీసుకోలేని వ్యక్తుల ప్రాణాలు కాపాడేందుకు ప్రభుత్వం సీపీఆర్ పై శిక్షణను ప్రారంభించిందని వెల్లడించారు.

అత్యంత కీలకమైన సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు.

ఎమర్జెన్సీ సమయంలో సీపీఆర్ ప్రక్రియను కొనసాగించక పోతే మూడు నుంచి నాలుగు నిమిషాలు తర్వాత ఆక్సిజన్ లేకపోవడంతో మనిషి బ్రెయిన్ డెడ్ అయ్యే అవకాశాలు ఉంటాయని తెలిపారు.



తెలంగాణ ప్రభుత్వం ఈ సీపీఆర్ పై హెల్త్ కేర్ వర్కర్స్, మునిసిపల్ ఉద్యోగులకు, పోలీస్ సిబ్బందికి, వాలంటీర్లు, షాపింగ్ మాల్ ఉద్యోగులకు, రెసిడెంట్ కాంప్లెక్స్ లకు సీపీఆర్, ఏఈడీపై శిక్షణ ఇస్తుందన్నారు.

వరంగల్ జిల్లాలో నలుగురు మెడికల్ ఆఫీసర్స్ హైదరాబాద్ లో సీపీఆర్ పై మాస్టర్ శిక్షణ తీసుకొన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట శాసనసభ్యులు ఆరూరి రమేశ్, మేయర్ గుండు సుధారాణి, జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి, కుడా చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, సీపీ ఏ. వి. రంగనాథ్ , అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ, శ్రీ వాత్స తదితరులు పాల్గొన్నారు

# పుతిన్‌కు అరెస్టు వారెంట్ జారీ చేసిన ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు

న్యూఢిల్లీ, మార్చి 18: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు అరెస్టు వారెంట్ జారీ చేసింది ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు. ఉక్రెయిన్ యుద్ధ నేరాలపై ఆయనకు శుక్రవారం ఈ వారెంట్ ఇష్యూ అయ్యింది. ఉక్రెయిన్‌లోని పిల్లల్ని చట్టవ్యతిరేకంగా డిపోర్ట్ చేసినట్లు పుతిన్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో హేగ్‌లోని ఐసీసీ.. రష్యాకు చెందిన చిల్డ్రన్ రైట్స్ కమీషనర్ మారియా లోవా బెలోవాకు కూడా అరెస్టు వారెంట్ జారీ చేసింది.

ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు జారీ చేసిన ఆ ఆదేశాలను రష్యా అధికారులు కొట్టిపారేశారు. ఐసీసీలో రష్యాకు భాగస్వామ్యం లేదని అన్నారు. కానీ ఐసీసీ ఇచ్చిన తీర్పును ఉక్రెయిన్ స్వాగతించింది. ఇది చరిత్రాత్మకమైన నిర్ణయమని జెలెన్‌స్కీ అన్నారు. గత ఏడాది ఫిబ్రవరి 24వ తేదీ నుంచి ఇప్పటి వరకు ఉక్రెయిన్‌కు చెందిన సుమారు 16 వేల మంది చిన్నారుల్ని అక్రమ రీతిలో రష్యాకు డిపోర్ట్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఐసీసీ ఆదేశాల ప్రకారం.. ఒకవేళ పుతిన్ ఏదైనా ఐసీసీ సభ్య దేశంలో అడుగుపెడితే, అప్పుడు అతన్ని అరెస్టు చేసే అవకాశాలు ఉంటాయని ప్రాసిక్యూటర్ కరీమ్ ఖాన్ తెలిపారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో సుమారు 120 సభ్య దేశాలు ఉన్నాయి. అయితే వారెంట్‌ను అమలు చేసే పరిస్థితి మాత్రం అంతర్జాతీయ దేశాల సహకారంపై ఆధారపడి ఉంటుందని ఐసీసీ ప్రెసిడెంట్ పియోటర్ హాఫ్‌మన్‌స్కీ తెలిపారు.

# QNet పై సమగ్ర విచారణ జరపండి- ప్రభుత్వానికి సజ్జన్నార్ వినతి ..

హైదరాబాద్, మార్చి 18:హైదరాబాద్ – సికింద్రాబాద్ స్వప్నలోక్ కాంప్లెక్స్ అగ్నిప్రమాద ఘటనలో దుర్మార్గపు సంస్థ ఖీఔవబి పాత్రపై సమగ్ర విచారణ జరగాలని టీఆర్ఆర్టీసీ ఎండి, ఐపిఎస్ అధికారి సజ్జన్నార్ ప్రభుత్వాన్ని కోరారు.. ఈ మేరకు ఆయన వరుసగా ట్విట్లు చేశారు."ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి.బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. మోసపూరిత సంస్థల కదలికలపై లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీస్ నిఘా పెట్టాలి. స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం జరగడం బాధాకరం. ఈ దుర్ఘటనలో మధ్య తరగతి కుటుంబాలకు చెందిన ఆరుగురు యువతీయువకులు మృతి చెందడం కలిచివేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేలలా అండగా నిలుస్తాం. భారీ డబ్బును ఆశచూపి అమాయకులను మోసం చేస్తోన్న క్యూనెట్ బాగోతం ఈ అగ్నిప్రమాదంతో మరోసారి బయటపడింది.క్యూనెట్ అమాయకులైన ఆరుగురిని పొట్టనబెట్టుకుంది. ఆ కాంప్లెక్స్‌లో బీఎం5 సంస్థ పేరిట కాల్ సెంటర్ నిర్వహిస్తూ తెరవెనక క్యూనెట్ ఎంఎల్ఎం దందా సాగిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దాదాపు 40 మందికి పైగా యువతీయువకులు అక్కడ పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. క్యూనెట్ ఏజెంట్లు ఒక్కొక్కరి దగ్గరి నుంచి రూ.1.50–3 లక్షలు కట్టించుకున్నట్లు మృతుల కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మోసపూరిత క్యూనెట్ పై అనేక కేసులు నమోదు చేసిన, ఈడీ ఆస్తులను జప్తు చేసిన తీరు మారడం లేదు. యువతీ యువకుల్లారా! అధిక డబ్బుకు ఆశపడి క్యూనెట్ లాంటి మోసపూరిత ఎంఎల్ఎం సంస్థల మాయలో పడకండి. మీ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోకండి. ఎంఎల్ఎం సంస్థలు అరచేతిలో వైకుంఠం చూపిస్తూ యువతను ఆకర్శిస్తూ బుట్టలో వేసుకుంటున్నాయి. జాగ్రత్తగా ఉండండి. మోసపూరిత సంస్థల విషయంలో భవన యాజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సంస్థ మోసపూరితమైందా? కాదా? అని ఒకటికి రెండుసార్లు నిర్ధారించుకుని అద్దెకి ఇవ్వాలి. భవన యజమానులు అధిక అద్దెకు ఆశపడి.. ఇలాంటి మోసాలకు బాధ్యులు కావొద్దు అంటూ హితవు పలికారు..

# బంగారం ధరల్లో ఆల్‌టైం రికార్డు.. హైదరాబాద్‌లో రూ.60,320 !

న్యూఢిల్లీ, మార్చి 18: సిలికాన్ వ్యాలీ బ్యాంక్ (ఎస్వీబీ).. దానివెంటే సిగ్నేచర్ బ్యాంక్ దివాళా.. అదే బాటలో స్విస్ బ్యాంక్ క్రెడిట్ సూయిజ్ పయనం.. అమెరికా, ఈయూ బ్యాంకుల్లో సంక్షోభం.. అనిశ్చితిలో అమెరికా డాలర్.. ఈయూ యూరో చిక్కుకున్నాయి. దీంతో ఇన్వెస్టర్‌కు ఆల్టర్నేటివ్ పెట్టుబడి మార్గంగా బంగారం కనిపిస్తున్నది. శనివారం దేశంలోని పలు నగరాల్లో తులం బంగారం (24 క్యారట్లు) ధర రూ.60 వేల మార్క్‌ను దాటేసింది. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో రూ.60,320 పలికింది. శుక్రవారం భాగ్యనగరంలో రూ.58,690లకు చేరుకున్నది. శుక్రవారం ధరతో పోలిస్తే శనివారం రూ.1630 పెరిగి రూ.60,320 వద్దకు చేరుకున్నది.ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారట్ల బంగారం ధర రూ.1500 పెరిగిపోయింది. దీంతో పెండ్లిండ్ల కోసం బంగారం కొనుగోలు చేయాలని భావిస్తున్న వారికి షాక్ తగిలినట్లయింది.

దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారట్ల బంగారం తులం ధర రూ.60,470గా నమోదైంది. ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారట్ల బంగారం పది గ్రాములు రూ.55,450. దేశ ఆర్థిక రాజధానిగా పేరొందిన ముంబైలో 24 క్యారట్ల బంగారం తుం రూ.60,470కి చేరుకోగా, ఆభరణాల తయారీలో ఉపయోగించే 22 క్యారట్ల బంగారం రూ.55,800గా నమోదైంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం నగరాల పరిధిలో పది గ్రాముల (22 క్యారట్లు) రూ.55,800, తులం బంగారం (24 క్యారట్లు) రూ.60,320 వద్ద కొనసాగుతున్నది.

శుక్రవారం ఫ్యూచర్స్ మార్కెట్ మెరుపులు

శుక్రవారం సాయంత్రం మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్) ఫ్యూచర్స్‌లో బంగారం తులం ధర ఆల్‌టైం రికార్డు నమోదు చేసింది. 10 గ్రాముల బంగారం (24 క్యారట్లు) ఏప్రిల్ ఫ్యూచర్స్ ధర ఇంట్రాడేలో రూ.59,461 పలికి ముగింపులో రూ.59,420 వద్ద స్థిర పడింది. గురువారం ముగింపు ధరతో పోలిస్తే రూ.1414 (2.44%) ఎక్కువ పలికింది. మరోవైపు వెండి మే ఫ్యూచర్స్ ధర సైతం మూడు శాతానికి పైగా వృద్ధి చెంది కిలోపై రూ.2118 పెరుగుదలతో రూ.68,649 వద్ద స్థిర పడింది. అమెరికా, ఈయూ బ్యాంకుల్లో సంక్షోభం ఇప్పటికిప్పుడు ముగిసేలా కనిపించడం లేదు కనుక బులియన్ మార్కెట్‌లో బుల్ పరుగులు తీయనున్నది.

వచ్చేవారమూ బంగారం, వెండి ధరల్లో దూకుడు

వచ్చేవారం యూఎస్ ఫెరడల్ రిజర్వ్.. ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశం కానున్నది. ప్రపంచ దేశాల్లోని బ్యాంకుల్లో సంక్షోభం వల్ల బంగారం, వెండికి గిరాకీ పెరిగింది. బంగారం, వెండి ధరల ధరల్లోనూ ఒడిదొడుకులు నమోదు కావచ్చునని స్వస్తికా ఇన్వెస్ట్‌మార్ట్ సీనియర్ కమోడిటీ రీసెర్చ్ అనలిస్ట్ నృపేంద్ర యాదవ్ చెప్పారు. ఇప్పటికే ఎంసీఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.59 వేల మార్క్‌ను దాటేసింది. వెండి కిలో ధర మాత్రం రూ.60 వేల వద్దే తచ్చాడుతున్నది

# అంగన్వాడి సెంటర్లకు వేయింగ్ మిషన్ల పంపిణి



మహబూబాబాద్, మార్చి 18:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలంలోని గంట్లకుంట గ్రామంలో అంగన్వాడి సెంటర్లకు వేయింగ్ మిషన్లను సర్పంచ్ చింతల భాస్కర్ చేతుల మీదగా అందించడం జరిగినది. గ్రామంలో 3 అంగన్వాడి సెంటర్లు ఉండగా ప్రతి సెంటర్కు ఒక్కొక్క వేయింగ్ మిషన్ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముక్తార్ పాషా, ఎంపీటీసీ ఈరెంటి అనురాధ ,గ్రామ కార్యదర్శి గూబ అశోక్ ,అంగన్వాడి టీచర్లు పసుల స్వరూప ,చింతల ఇందిర, చింతల సోమక్క, ఆశా వర్కర్ జిలకర రాధిక, కారోబార్ పాల వెంకట సోములు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లలో అవగాహన కోసం కళాశాల విద్యార్థుల వీధినాటక ప్రదర్శన

న్యూఢిల్లీ, మార్చి 18: 'క్రమానుగత ఓటరు అవగాహన–ఎన్నికల భాగస్వామ్యం' (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్–స్వీప్) కింద ఎన్నికల సంఘం చేపట్టిన కార్యకలాపాల్లో భాగంగా వీధి నాటకాలు ప్రదర్శించిన అధికారులు–కళాశాలల విద్యార్థులను కేంద్ర ఎన్నికల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధానాధికారి (సీఈవో) సత్కరించారు. దేశవ్యాప్తంగా ఓటర్లకు అవగాహన కల్పనతోపాటు వారు క్రమం తప్పకుండా ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములయ్యేలా ప్రోత్సహించడం లక్ష్యంగా భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమమిది.

ఈ సందర్భంగా సీఈవో శ్రీ వికాస్ రాజ్ మాట్లాడుతూ– ప్రత్యేక సంక్షిప్త సమీక్ష (ఎస్ఎస్ఆర్) సందర్భంగా వివిధ కార్యాలయాల సహకారంతో 'స్వీప్' కింద చేపట్టిన సమాచార ప్రదాన కార్యక్రమాలు సత్ఫలితాలిచ్చాయని పేర్కొన్నారు. దీంతో తాజా ఓటరు నమోదుకు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు అందాయని ఆయన వెల్లడించారు. ఈ దిశగా వినూత్న మార్గాల్లో పట్టణ ఓటర్లకు చేరువయ్యేందుకు సమాచార–ప్రసార మంత్రిత్వశాఖ పరిధిలోని కేంద్రీయ కమ్యూనికేషన్ల బ్యూరో (సిబిసి) ఎంతగానో కృషి చేసిందన్నారు. ఇందులో భాగంగా 'సిబిసి' చేపట్టిన ప్రయోగాత్మక వీధినాటక ప్రక్రియ విజయవంతమైందని, ఇకపై పట్టణ కేంద్రాల్లో ఈ నమూనాను విస్తృతంగా చేపడతామని ఆయన తెలిపారు.

కేంద్రీయ కమ్యూనికేషన్ల బ్యూరో అదనపు డైరెక్టర్ జనరల్ శ్రీమతి శ్రుతి పాటిల్ మాట్లాడుతూ– వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన దిశగా 'సిబిసి' ఇప్పటికే అనేక సంప్రదాయ కళారూపాలను సమర్థంగా వినియోగిస్తున్నదని పేర్కొన్నారు. ఇదే తరహా సంయుక్త కృషిని రాష్ట్రంలోనూ అమలు చేయగల ఒక ఉత్తమ కార్యాచరణగా రూపొందించవచ్చునని ఆమె సూచించారు. 'సిబిసి' పరిధిలోగల సంగీత–నాటక విభాగంలోని కళాకారులు ఈ వీధి నాటకాన్ని రచించారని, నగరంలోని వివిధ కళాశాలలకు వెళ్లి 10 మంది విద్యార్థుల వంతున ఐదు బృందాలను ఏర్పాటుచేసి శిక్షణ ఇచ్చారని వివరించారు. అనంతరం ఈ విద్యార్థి బృందాలు హైదరాబాద్ నగరంలోని గోల్కొండ కోట, ట్యాంక్ బండ్, ఇందిరాపార్క్, చార్మినార్ తదితర ప్రాంతాల్లో ఈ వీధి నాటకాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ నాటక ప్రదర్శనకు విశేష ప్రజాదరణ లభించిందని తెలిపారు.

ఈ సత్కార కార్యక్రమంలో సంయుక్త సీఈవో ఎస్.రవికిరణ్, ఆల్ ఇండియా రేడియో న్యూస్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీ రాహుల్ గౌలికర్ సహా కళాశాలల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బాధిత మహిళలకు అండగా భరోసా సెంటర్

ఖమ్మం,మార్చి 18: (నేటినిజం ప్రతినిధి): న్యాయం కోసం వచ్చిన బాధిత మహిళలకు అండగా నిలిచి...వారిలో మనో ధైర్యాన్ని నింపడానికి భరోసా సెంటర్ సాయపడుతోందని పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ అన్నారు. భరోసా సెంటర్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఖమ్మంలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ప్రాంగణంలో గల భరోసా సెంటర్ ను శనివారం సందర్శించి కేక్ కట్ చేసి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...హింసకు గురైన మహిళ ఎక్కడికీ వెళ్లే అవసరం



లేకుండా అన్ని సేవలు అందిస్తూ వారికి అవసరమైన కౌన్సిలింగ్, వైద్యం సదుపాయం, న్యాయ సహాయం, పోలీస్ సహాయంతో భరోసాను కల్పిస్తున్నారని అన్నారు.

2022 మార్చి 18న ప్రారంభమైన ఈ భరోసా సెంటర్లో ఇప్పటివరకు పలు పోలీస్ స్టేషన్ల ద్వారా లైంగిక వేధింపులు మరియు లైంగిక దాడులు గురైన బాధిత మహిళల 95 కేసులని తీసుకోవడం జరిగింది. ఇప్పటివరకు 95 కేసులలో కౌన్సిలింగ్ ని,161 స్టేట్మెంట్ రికార్డింగ్–92, మెడికల్ సర్వీస్–39, కోర్టులో 164 స్టేట్మెంట్ రికార్డింగ్–90, బాధ్యత మహిళల హోం విజిట్–60, అవగాహన కార్యక్రమాలు–47, ప్రభుత్వం ద్వారా బాధితులకు ఆర్థిక సహాయం అందించడం కోసం కాంపెన్సేషన్ అప్లై –59, విద్య మరియు వసతి సౌకర్యం కోసం బాధితులను బాలల సంక్షేమ సమితి–11, భరోసా నుండి బాధితులకు సహాయం అందించడం కోసం బాధిత మహిళల సహాయ నిధిని 11మందికి 55 వేల రూపాయలు సహాయం అందించటం జరిగిందని పోలీస్ కమిషనర్ విష్ణు యస్ వారియర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి( లాండ్‌ఆర్డర్)సుభాష్ చంద్రబోస్, టౌన్ ఏసిపి గణేష్, ట్రాఫిక్ ఏసిపి రామోజీ రమేష్, ట్రాఫిక్ సిఐ అంజలి, భరోసా ఇంచార్జ్ ఎస్సై ఉమా, సంధ్యారాణి, భరోసా కోఆర్డినేటర్ రాజకుమారి, స్టాఫ్ పాల్గొన్నారు.


## ఆహ్వానము

వికాస వేదిక సాహిత్య సంస్థ - ఖమ్మం ఆధ్వర్యంలో **ఉగాది - 2023 కవి సమ్మేళనం**, నల్ల కృష్ణమూర్తి గారి **"స్ఫూర్తిస్వరాలు"** పుస్తక ఆవిష్కరణ, శైలజా శ్రీనివాస్ గార్ల తిరునగరి పురుషోత్తం, యడవల్లి పురుషోత్తం గార్ల మెమోరియల్ ట్రస్ట్ ద్వారా ఉగాది విశిష్ట సాహిత్య పురస్కారాలు-2023.కావున కవులకు, సాహిత్యాభిమానులకు ఇదే మా హృదయపూర్వక ఆహ్వానము.

తేది : 22-03-2023 మధ్యాహ్నం 1 గంటలకు
వేదిక : హర్షిణి డవలపర్స్ కార్యాలయం, ఖమ్మం -3 (ఎఫ్.సి.ఐ. బైపాస్ రోడ్, సమ్మక్క - సారలమ్మ ద్వారము కింద నుండి)

ఆహ్వానము : **కొంపెల్లి రామయ్య**గారు
సభాధ్యక్షులు : గౌ॥ శ్రీ సాదనాల వేంకటస్వామినాయుడు గారు
సినీ గేయ రచయిత, నంది బహుమతి గ్రహీత

విశిష్ట అతిధులు : గౌ॥ శ్రీ తోటపల్లి సృజన్ కుమార్ గారు, యువ ఇంజనీర్, బిల్డర్ సంస్థ - సి.యం.డి.
డా॥ గౌ॥ శ్రీమతి వేల్పుల విజేత గారు, ఖమ్మం జిల్లా మహిళా ప్రాంగణ అధికారిణి
గౌ॥ శ్రీ పారుపల్లి సురేష్‌గారు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత
గౌ॥ శ్రీ డా॥ అల్లిక వేంకటేశ్వర్లుగారు, హర్షిణి డవలపర్స్ అధినేత
గౌ॥ శ్రీ మద్ది శ్రీనివాసరెడ్డిగారు గోల్డ్ మెడలిస్ట్, ప్రముఖ న్యాయవాది
గౌ॥ శ్రీ కె.అజయ్‌కుమార్ గారు , మేనేజర్, పరిశ్రమలశాఖ, ఖమ్మంజిల్లా.
గౌ॥ శ్రీ నల్ల కృష్ణమూర్తిగారు, "స్ఫూర్తిస్వరాలు" పుస్తక రచయిత
గౌ॥ శ్రీ మేడగాని శేషగిరిగారు, కవి, గాయకులు

ఆత్మీయ అతిధులు: గౌ॥ శ్రీమతి శైలజ శ్రీనివాస్‌గారు,
గౌ॥ శ్రీ ఆంగోతు జయవాసుగారు
గౌ॥ శ్రీ లెనిన్ శ్రీనివాస్‌గారు
గౌ॥ శ్రీ మలిశెట్టి కృష్ణమూర్తిగారు,

**పురస్కార గ్రహీతలు**

గౌ॥ శ్రీ బుక్కా సత్యనారాయణ గారు, గౌ॥ శ్రీ నామవరపు కాంతేశ్వరరావుగారు, గౌ॥ శ్రీమతి గాజుల భారతి శ్రీనివాస్‌గారు, గౌ॥ శ్రీ యం.డి.జహీరుద్దీన్ గారు, గౌ॥ శ్రీ రెంటాల చిన్న హుస్సేన్‌గారు

వందన సమర్పణ : కొత్త శంకర్‌రెడ్డి గారు

**వికాస వేదిక సాహిత్య సంస్థ, ఖమ్మం**


# పెద్దవంగర తహసీల్దార్ ను సన్మానించిన విశ్వబ్రాహ్మణ సంఘం.

## -దాతలు ముందుకు రావడం అభినందనీయం...బోగోజు భద్రయ్య చారి.



మహబూబాబాద్, మార్చి 18:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండల కేంద్రంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్‌విగ్రహ ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని జయశంకర్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోగోజు భద్రయ్య చారి అన్నారు. పెద్దవంగర మండల తహసీల్దార్ రమేష్ బాబు విగ్రహానికి అయ్యే మొత్తం ఖర్చు ఇస్తానని ఒప్పుకోవడంతో ఆయనను విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు మల్లికార్జున చారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విగ్రహ ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని వారు కోరారు. వీరితో పాటు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు శంకర్, వేవా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, శ్యామ్ సుందర్ చారి, బొగోజు నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం ఘన విజయం

## -వైసీపీ కి, జగన్ రెడ్డికి పలితాలు చెంపపెట్టు బొరగం శ్రీనివాసులు



ఏలూరు మార్చ్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం ఘన విజయం సాధించడం వైసీపీ కి, జగన్ రెడ్డికి చెంపపెట్టు అని టీడీపీ పోలవరం నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు వ్యాఖ్యానించారు. ఆయన మాట్లాడుతూ.. "పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం విజయం అసమర్ధ పాలకుడు జగన్ రెడ్డికి చెంపపెట్టు. పట్టభద్రులు ప్రజాస్వామ్య పరిరక్షణకై నడుం బిగించి ఇచ్చిన ఫలితం. రాష్ట్రంలో సాగుతున్న వైసీపీ దమనకాండ పాలనకు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు ఇది. 2024లో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధిస్తుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే తెలుగుదేశం పార్టీ వైపే ప్రజలు ఉన్నారని, చంద్రబాబు పాలన కోరుకుంటున్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం ప్రధాన లక్ష్యం అని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో అరకు, పాడేరు నియోజకవర్గాల పరిశీలకునిగా పనిచేయటం, విజయంలో భాగస్వామి అవటం సంతోషంగా ఉంది" అని ఆయన చెప్పుకొచ్చారు.

# సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి-జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



రాజన్న సిరిసిల్ల, మార్చి 18: (నేటినిజం ప్రతినిధి): సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైతే టోల్ ఫ్రీ నెంబర్లు 1930, డయల్ 100లకు తక్షణమే కాల్ చేయాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్ అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళు ఆశ, భయం అనే రెండు అంశాల మీద నేరాలు చేస్తున్నారని తెలిపారు. ఒక వ్యక్తికి ఏదైనా ఆశ చూపించి తక్కువ కాలంలో ఎక్కువ డబ్బులు వస్తాయని, అతని నుండి వ్యక్తిగత సమాచారం తీసుకుని సైబర్ నేరం చేయడం జరుగుతుందని అన్నారు. వ్యక్తికి సంబంధించిన బ్యాంకు అకౌంట్ కానీ, పాన్ కార్డు కానీ, ఇతర అకౌంట్లు బ్లాక్ అవుతుందని భయపెట్టి వారి నుంచి వ్యక్తిగత సమాచారం తీసుకొని సైబర్ నేరం చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుత సమాజంలో ఇంటర్నెట్ ఉపయోగం పెరగడం వల్ల ప్రతి వ్యక్తి ఏదో అవసరానికి ఫోన్లు వాడడం జరుగుతుందని, అదే అదునుగా సైబర్ నేరగాళ్ళు వ్యక్తిగత సమాచారాన్ని దొంగలించి మన బ్యాంకులు, వ్యాలెట్స్ ఇతర వాటి నుండి డబ్బులు సులువుగా దోచేస్తున్నారని, అందువల్ల వ్యక్తిగత సమాచారాన్ని ఎప్పుడు సామాజిక మాధ్యమాలలో పంచుకోకూడదని అన్నారు. సైబర్ నేరగాళ్లు ఇలాంటి అవకాశాల కోసం వేచి చూస్తారని, కావున ఫోన్లు వాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కి కాల్ చేస్తే మీరు పోగొట్టుకున్న డబ్బులను తిరిగి పొందేలా చేయవచ్చున్నారు. లేదా ఎన్సీఆర్పీ పోర్టల్ లో ఫిర్యాదు చేస్తే సంబంధిత పోలీస్ స్టేషన్ వారు తక్షణమే స్పందిస్తారని అన్నారు. గత వారం రోజులలో జరిగిన సైబర్ నేరాలను ఎస్పీ వివరించారు.

తంగళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక బాధితుడు యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు యొక్క రివార్డ్స్ పాయింట్స్ రీడింగ్ చేసుకోమని ఒక వ్యక్తి నుండి కాల్ రావడం జరిగిందని, బాధితుడు అది నమ్మి అతనితో ఓటీపీ షేర్ చేసుకున్నాడ, దీని ద్వారా బాధితుడు 8234 నష్టపోయాడని తెలిపారు.

సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుడు నుండి అతని ఫ్రెండు ఓటిపి షేర్ తీసుకొని అతని ఓటిపి ద్వారా షేర్ షాట్ యాప్ లో అకౌంట్ క్రియేట్ చేసుకుని ఒక తెలియని వ్యక్తి తో చాట్ చేయడం జరిగిందన్నారు. తర్వాత ఆ వ్యక్తి బాధితుడికి కాల్ చేసి హరేజ్మెంట్ కేసు పెడతానని చెప్పి 18,000 రూపాయలు గూగుల్ పే చేయించుకున్నాడని అన్నారు. సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుడికి ఒక సస్పెక్ట్ మొబైల్ నెంబర్ నుండి దని లోన్ ఆప్ నుండి లోన్ ఇస్తామని చెప్పి డాక్యుమెంట్స్ ప్రాసెసింగ్ చార్జెస్ కింద డబ్బు పంపించమనగా బాధితుడు 17000 ట్రాన్స్ఫర్ చేసి మోసపోయాడని పేర్కొన్నారు. వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితుడు మొబైల్ హబ్ అనే సైట్లు మొబైల్స్ చాలా తక్కువ ధరకు అమ్ముతున్నారని తెలుసుకొని అందులో ఒక మొబైల్ ఆర్డర్ గురించి 2500 రూపాయలు చెల్లించాడని, కానీ ఆ సైట్ అతనికి ఎలాంటి మొబైల్ డెలివరీ చేయలేదన్నారు. ఇలాంటి వాటిని నమ్మవద్దని ఎస్పీ సూచించారు. నమ్మదగిన ఆప్స్, వెబ్ సైట్లలోనే ఆర్డర్ చేయాలని, సోషల్ మీడియా యాడ్స్ చూసి ఆఫర్ లో వస్తున్నాయని, ఆ యాడ్స్ లో ఉండే నంబర్స్ కి కాల్ చేసి సైబర్ మోసాలకు గురి అవ్వదని అన్నారు. మీ ఎస్బిఐ యోనో ఎస్ ఎంబీఐ బ్లాక్ అయిందని, పాన్ కార్డు అప్డేట్ చెయ్యమని వచ్చే మెసేజులు నమ్మవద్దని తెలిపారు. అందులో ఉన్న లింక్స్ పై క్లిక్ చెయ్యవద్దని, సోషల్ మీడియాలో ప్రకటనలు చూసి పెట్టుబడి పెట్టవద్దని పేర్కొన్నారు.

ఓటీపీ వస్తే దాన్ని ఎవరికీ చెప్పవద్దని, వ్అది సైబర్ నేరగాళ్ల ఎత్తుగడ అయివుండవచ్చని పేర్కొన్నారు.

# ఐదు భాషల్లో "కేసరియా" సాంగ్ పాడిన సింగర్.. ప్రశంసించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, మార్చి 18:పంజాబ్ కి చెందిన ఒక గాయకుడు స్నేహదీప్ సింగ్ కల్సి ఐదు వేర్వేరు భాషల్లో కేసరియాను పాటను పాడారు. సోషల్ మీడియాలో తుఫానుగా మారింది. మలయాళం, తెలుగు, కన్నడ, తమిళం, హిందీ భాషల్లో స్నేహదీప్ బ్రహ్మాస్త్ర పాటను పాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. స్నేహదీప్ ఈ పాటను బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లోని తన స్నేహితులు మాజీ సహోద్యోగులకు అంకితం చేస్తూ పాడినట్టు తెలిపాడు.

కాగా, ఈ వీడియో ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోడీ దృష్టిని ఆకర్షించింది. నిన్న (శుక్రవారం) సాయంత్రం, పిఎం మోడీ కేసరియా వ్యక్తి ఫోటోని చేస్తూ అతని ప్రయత్నాలను ప్రశంసించారు. "ఒక పంజాబీ కుర్రాడు మలయాళం, తమిళం, కన్నడ, తెలుగు, హిందీ భాషల్లో కేసరియా పాడాడు. నాకు దక్షిణాది భాషలు తెలియకపోయినా అద్భుతంగా అనిపిస్తాయి. మరిన్ని భాషలు నేర్చుకోవడం చాలా అందమైన విషయం" అంటూ ట్విట్టర్‌లో షేర్ చేశారు. అంతే కాకుండా ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో కూడా వీడియోను షేర్ చేశారు.

ఈ వీడియో ఇంటర్నెట్ నుండి విస్తృత ప్రశంసలను అందుకుంటూనే ఉంది. వారిలో ఒకరు ఇలా వ్రాశారు, "ఇటువంటి మధురమైన వాయిస్ మాడ్యులేషన్‌లు, అద్భుతమైన ప్రదర్శన మన గొప్ప దేశం 'భిన్నత్వంలో ఏకత్వాన్ని' చూపుతుంది. మేరా భారత్ మహాన్." అంటూ ప్రశంసించారు.

# యూపీ వారియర్స్ థ్రిల్లింగ్ విక్టరీ.. ముంబైకి తొలి ఓటమి



న్యూఢిల్లీ, మార్చి 18: ముంబై ఇండియన్స్‌తో హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్స్ థ్రిల్లింగ్ విక్టరీ సాధించింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన యూపీ, ముంబైకి తొలి ఓటమిని రుచి చూపించింది. 105 పరుగులకే సగం వికెట్లు పడ్డా కూడా యూపీ బ్యాటర్లు ఒత్తిడికి లోనవ్వలేదు. 20వ ఓవర్ మూడో బంతికి సోఫీ ఎక్లెస్టోన్ సిక్సర్ బాది మ్యాచ్ ముగించింది. మూడు విజయాలతో యూపీ పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో నిలిచింది. ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది.

మహిళల ప్రీమియర్ లీగ్‌లో యూపీ వారియర్స్ అద్భుతం చేసింది. ఓటమన్నదే ఎరుగని ముంబై ఇండియన్స్‌పై సంచలన విజయం నమోదు చేసింది. ఐదు వికెట్లు పడ్డా కూడా అసమాన పోరాట పటిమను ప్రదర్శించింది. దీప్తి శర్మ(13), , సోఫీ ఎక్లెస్టోన్ (16) నాటౌట్‌గా నిలిచి జట్టును గెలిపించారు. వీళ్లు ఏడో వికెట్‌కు 24 రన్స్ జోడించారు.

20వ ఓవర్‌లో 5 రన్స్ అవసరం అయ్యాయి. వాంగ్ వేసిన తొలి రెండు బంతులకు ఒక్క పరుగు రాలేదు. దాంతో, ముంబై గెలుపు ఖాయం అనుకున్నారంతా. కానీ, మూడో బంతికి ఎక్లెస్టోన్ లాంగాఫ్‌లో భారీ సిక్సర్ బాదింది. దాంతో, యూపీ ఐదు వికెట్ల తేడాతో గెలుపొందింది. ముంబై బౌలర్లలో అమేలియా కేర్ రెండు, మాథ్యూస్, ఇసీ వాంగ్ తలా ఒక వికెట్ తీశారు.

ఆదుకున్న మెక్‌గ్రాత్, హ్యారిస్

స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన యూపీ వారియర్స్‌కు రెండో ఓవర్‌లో షాక్ తగిలింది. హర్మన్‌ప్రీత్ కౌర్ స్లిప్ ఒంటి చేత్తో స్టన్నింగ్ క్యాచ్ పట్టడంతో ఓపెనర్ దేవికా వైద్య (1) వెనుదిరిగింది. కెప్టెన్ ఎలీసా హేలీ (8), కిరణ్ నవగరే(12) తక్కువకే ఔటయ్యారు. 71 రన్స్‌కే మూడో వికెట్ కోల్పోయిన యూపీని తహ్లియా మెక్‌గ్రాత్ (38), గ్రేస్ హ్యారిస్ (39) ఆదుకున్నారు. వీళ్లు నాలుగో వికెట్‌కు 46 రన్స్ జోడించారు. అమేలియా కేర్ గూగ్లీతో మెక్‌గ్రాత్‌ను బోల్తా కొట్టించింది. దాంతో, 105 పరుగుల వద్ద యూపీ ఐదో వికెట్ పడింది. ఆ తర్వాతి ఓవర్‌లో అమేలియా మళ్లీ యూపీని దెబ్బకొట్టింది. హ్యారిస్‌ను ఔట్ చేసింది.

టాపార్డర్ విఫలం

మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ 127 పరులకే పరిమితమైంది. యూపీ బౌలర్లు చెలరేగడంతో ఆ జట్టు ప్రధాన బ్యాటర్లు చేతులెత్తేశారు. ఓపనర్ యస్తికా భాటియా (7)ను అంజలీ సర్వానీ బౌల్డ్ చేసింది. ఆ తర్వాత వచ్చిన నాట్ సీవర్ బ్రంట్ (5)ను ఎక్లెస్టోన్ ఎల్బీగా వెనక్కి పంపింది. గత మ్యాచ్‌లో హాఫ్ సెంచరీ కొట్టిన కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (25) కూడా భారీ స్కోర్ చేయలేకపోయింది. 78 రన్స్ వద్ద ఆమె వికెట్ పడింది. ఒక దశలో ముంబై 100 పరుగుల లోపే ఆలౌట్ అయ్యేలా కనిపించింది. కానీ, చివర్లో ఆల్‌రౌండర్ ఇసీ వాంగ్ చెలరేగి ఆడింది. 4 ఫోర్లు, ఒక సిక్స్‌తో 19 బంతుల్లోనే 32 రన్స్ చేసింది. యూపీ వారియర్స్ బౌలర్లలో సోఫీ ఎక్లెస్టోన్ మూడు, రాజేశ్వరీ గైక్వాడ్, దీప్తి శర్మ రెండేసి వికెట్లు తీశారు. అంజలీ సర్వాణీకి ఒక వికెట్ దక్కింది.

# ఖాన్ పుర అబూబకర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత హిజామా క్యాంపుకు విశేష స్పందన

## –క్యాంపు ప్రారంభించిన త్రీ టౌన్ ఎఎస్సై బషీర్



కరీంనగర్, మార్చి 18: (నేటినిజం ప్రతినిధి): నగరంలోని 4వ డివిజన్ ఖాన్ పుర అబూ బకర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.. మదర్సా ఇస్లామియా అబుబకర్ సిద్ధిఖ్ లో శనివారం ఉచిత హిజామా క్యాంపు ను నిర్వహించారు. ఈక్యాంపును మూడవ పోలీసు టౌన్ ఎఎస్సై ముఖ్యఅతిథిగా బషీర్ హాజరై ప్రారంభించారు. అశోక్ నగర్ నాకా చౌరస్తాలోని షిఫా క్లినిక్ డాక్టర్ ముస్తాక్ అహ్మద్ రజ్వి సహాయ సహకారాలతో.. హాఫిజ్ జావిద్ నియాజీ పర్యవేక్షణలో క్యాంపు పెద్దఎత్తున విజయవంతం అయింది. నగరంలోని ముకరం పుర నబీల్ హిజామా సెంటర్ నిర్వహణలో యువకులకు, మహిళలకు వేర్వేరుగా నిర్వహించిన ఈ క్యాంపుకు నగరంలోని పలు ప్రాంతాల స్థానికుల నుంచి విశేషంగా స్పందన లభించింది. ఇప్పటి వరకు అబూ బకర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించింది ఈ క్యాంపు ఏడవది కావడం విశేషం. ఈసందర్భంగా నబీల్ హిజామా సెంటర్ నిర్వాహకుడు ఖాజా ముఫీజుద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఆరు నెలల ఒకసారి హిజామా చేయించుకుంటే రక్త సరఫరా లోపం నుంచి విముక్తి, గుండె ఫంక్షనింగ్ మంచిగా జరుగుతుందని, వెన్నునొప్పి, ఫంగల్ ఇన్ఫెక్షన్, మైగ్రేన్ నొప్పి, గుండె సంబంధిత వ్యాధులు, జీర్ణవ్యవస్థ పటిష్టం, మోకాళ్ల నొప్పులు, మెడ, కండరాల నొప్పులు వంటి వ్యాధులతో శాశ్వతంగా ఉపశమనం కలుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకు ముకరంపుర లోని ఖుబా మస్జిద్ వద్ద నబీల్ హిజామా సెంటర్ లో లేదా 9949864233 నెంబర్ కు సంప్రదించాలని కోరారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు ముస్తాఖ్ అహ్మద్ రజ్వి, హాఫిజ్ జావిద్ నియాజీ, హిజామా స్పెషలిస్ట్ ఖాజా ముఫీజుద్దీన్, సహాయకులు ఆమెర్, హాఫిజ్ జాకీర్ అలీల్, 3వ డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు సాజిద్, 43డివిజన్ అధ్యక్షుడు జావిద్, సోషల్ వర్కర్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# నాటు నాటు పాట నాకు నచ్చలేదు

## – అసలు అది ఒక పాటేనా? అందులో సంగీతం ఎక్కడ ఉంది?

## –కీరవాణి తండ్రి శివశక్తి దత్తా ఆసక్తికరమైన వ్యాఖ్యలు

హైదరాబాద్ మార్చ్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు సాంగ్ ప్రపంచాన్ని ఉర్రూతలూగించింది. ఈ పాటలోని లిరిక్స్ అర్థం కాకపోయినా విదేశీయులకు తెగ నచ్చేసింది. ఇందులోని మ్యూజిక్ వాళ్లకు పిచ్చెక్కించింది. అందుకే చిన్నా పెద్దా.. సామాన్యులు.. సెలబ్రెటీలు అనే తేడా లేకుండా చాలామంది ఈ సాంగ్‌కు కాళ్లు కదిపారు. నాటు నాటు సాంగ్‌కు వస్తున్న క్రేజ్ చూసి ప్రతిష్టాత్మకమైన ఆస్కార్ అవార్డు కూడా గేయ రచయిత చంద్రబోస్, మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణిని వరించింది. ఇంతలా అందర్నీ ఆకట్టుకున్న నాటు నాటు పాట మాత్రం కీరవాణి తండ్రి శివశక్తి దత్తాకు నచ్చలేదట. ఈ పాటలో అసలు సంగీతమెక్కడ ఉంది అంటూ తాజాగా సెన్సేషల్ కామెంట్స్ చేశాడు. శివశక్తి దత్తా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. కీరవాణికి ఆస్కార్ అవార్డు రావడం పట్ల అతని తండ్రి శివశక్తి దత్తా ఆనందంతో ఉప్పొంగిపోయాడు. ఈ సందర్భంగా కీరవాణి గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశాడు. కీరవాణి తనకు పంచప్రాణాలు అని శివశక్తి దత్తా చెప్పుకొచ్చాడు. మూడో ఏట నుంచే కీరవాణికి సంగీతం నేర్పించానని చెప్పాడు. చిన్నప్పటి నుంచి కీరవాణి టాలెంట్ చూసి ఆశ్చర్యపోతూనే ఉన్నానని తెలిపాడు. అయితే ఆర్ఆర్ఆర్ సినిమాలోని నాటు నాటు సాంగ్ తనకు నచ్చలేదని పేర్కొన్నాడు. అసలు అది ఒక పాటేనా? అందులో సంగీతం ఎక్కడ ఉంది? అంటూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. కానీ విధి విచిత్రమైనదని.. ఇన్నాళ్లు కీరవాణి పడ్డ కష్టానికి ఆస్కార్ రూపంలో ఫలితం దక్కిందని సంతోషం వ్యక్తం చేశాడు. చంద్రబోస్ రాసిన 5వేల పాటల్లో ఒదొక పాటనా? కీరవాణి ఇచ్చిన సంగీతంతో పోలిస్తే ఇదొక మ్యూజికేనా? అని ప్రశ్నించాడు. నాటు నాటు పాటలో ప్రేమ్ రక్షిత్ కొరియోగ్రఫీ మాత్రం చాలా అద్భుతంగా ఉందని శివశక్తి దత్తా ప్రశంసించాడు. ఈ పాటకు రామ్ చరణ్, ఎన్టీఆర్ అద్భుతంగా డ్యాన్స్ చేశారని కొనియాడారు. రాజమౌళి కాన్సెప్ట్ అదుర్స్.. చంద్రబోస్, కీరవాణి కృషికి నాటు నాటు పాట రూపంలో ఫలితం దక్కిందని చెప్పుకొచ్చాడు.

# ఏపీ సీఎం జగన్ ఢిల్లీ యాత్ర లో మర్మమేమి?

## – వైసీపీ రెబల్ ఎంపీ రఘురామ కృష్ణం రాజు

న్యూ ఢిల్లీ మార్చ్ 18 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఏపీ సీఎం జగన్ ఢిల్లీ యాత్ర లో మర్మమేమి? ఒక్క కొత్తం అంశం లేదు.. కానీ ఢిల్లీకి తీసుకొచ్చి ఇచ్చే వేంకటేశ్వర స్వామి బొమ్మ సైజ్ మాత్రం పెరిగిందని వైసీపీ రెబల్ ఎంపీ రఘురామ కృష్ణం రాజు అన్నారు. శనివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ... తూర్పు, పశ్చిమ రాయలసీమ, ఉత్తరాంధ్రలో ప్రజలు వైసీపీ ని తిరస్కరించారని, పులివెందులలో కూడా మెజారిటీ లేదని అన్నారు. పులివెందుల లో పార్టీ పరిస్థితి ఇలా ఉంటే.. మరీ కుప్పం అంటున్నారు... 175 కు 175 స్థానాల్లో గెలుస్తామని అంటున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం పని అయి పోయిందని, ప్రజలు బయటకు వస్తున్నారని రఘురామ అన్నారు. టీడీపీ అభ్యర్థులు శ్రీకాంత్, భూమి రెడ్డి రామ గోపాల్ రెడ్డి ఖర్చు చేయలేదని.. వైసీపీ శ్రేణులు ఎక్కువగా ఖర్చు పెట్టారని తెలియవచ్చిందన్నారు. టీడీపీ కి మెజారిటీ వచ్చిందంటే ధన ప్రవాహం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఒక దరిద్రపు నిర్ణయం తీసుకున్నా రు...రాజధాని మార్పుతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తుడుచుపెట్టుకుని పోవడం ఖాయమని అన్నారు. డబ్బు లతో రాజకీయం చేయడం మానాలని ఎంపీ రఘురామ సూచించారు. ఎవరు నిలబడగలరు, ఎవరు అండగా ఉంటారో నమ్ముతూ.. ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చారన్నారు. కడపలో వైఎస్ వివేకానంద రెడ్డి హత్య ప్రభావం చాలా ఉందని రఘురామ కృష్ణంరాజు అభిప్రాయం వ్యక్తం చేశారు.

# నిరుద్యోగి నవీన్ ఆత్మహత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

## –టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మోతె రాజిరెడ్డి



రాజన్న సిరిసిల్ల, మార్చి 18: (నేటినిజం ప్రతినిధి): సిరిసిల్లకు చెందిన నవీన్ ఆత్మహత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మోతె రాజిరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ యువత ఉద్యోగాలు వస్తాయని గంపెడాశలు పెట్టుకుంటే ఇలాంటి వైఫల్యాలతో ప్రభుత్వం వారి ఉసురు తీస్తుందన్నారు.

నవీన్ చావుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్ల పట్టణంలో ఉపాధి కరువై ఒక నిరుద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడని, దీనికి ఏం సమాధానం చెప్తారని నికదేశారు. పేపర్ లీకేజీల వ్యవహారంలో బీఆర్ఎస్ మంత్రుల పాత్ర ఉందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థత వల్లనే పేపర్ లికేజ్ అయిందని, ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగుల ఉసురు కల్వకుంట్ల ఫ్యామిలీకి తప్పక తగులుద్దని అన్నారు. ఇంట్లో ఐదు ఉద్యోగాలు ఇచ్చుకున్న ఘనత కేసీఆర్ కే దక్కిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బర్తరఫ్ అయుతనే ఆత్మహత్య చేసుకున్న నిరుద్యోగులకు అసలైన ఆత్మశాంతి అన్నారు. నిరుద్యోగుల పక్షాన తెలుగుదేశం పార్టీ, టీఎన్ఎఫ్ అండగా ఉండి పోరాటం చేస్తుందని భరోసా కల్పించారు.

# షీటీంపై కేజీబివి విద్యార్థులకు అవగాహన



రాజన్న సిరిసిల్ల, మార్చి 18: (నేటినిజం ప్రతినిధి): సిరిసిల్ల పట్టణంలోని పెద్దబోనాల వద్ద గల కస్తూర్బా గాంధీ హై స్కూల్లో షీటీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు శనివారం షీ టీమ్ ఉపయోగాలు, సైబర్ క్రైమ్, డయల్100, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ ల మీద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్ఐ ప్రేమ్ దీప్ మాట్లాడుతూజిల్లాలో మహిళలు హక్కులు, రక్షణకు షీటీం ప్రత్యేకంగా పనిచేస్తుందన్నారు. విద్యార్థినులను వేధింపులకు గురిచేసిన, ర్యాగింగ్ చేసిన కఠిన చర్యలు ఉంటాయని స్కూల్లో, కళాశాలలో, బస్టాప్ ఇతర నిర్మాణ ప్రాంతాలు ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే షీ టీం పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 8712656425కు లేదా డయాల్ 100కు కాల్ చేయాలన్నారు. అదే విధంగా షీటీం యొక్క పని విధానం,పోక్సో ఆక్ట్, ఈవిటీజింగ్, ర్యాగింగ్,గుడ్ టచ్, బ్యాడ్ టచ్, అమ్మాయిల వేధింపులు, పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థిని, విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఒకవేళ సైబర్ నేరానికి గురి అయినట్లయితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930కి లేదా డయల్ 100 కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పించారు. సైబర్ నేరాల గురించి విద్యార్థులు తమ ఇంట్లో ఉన్న తల్లిదండ్రులకు ఇరుగుపొరుగు వారికి సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో షీటీమ్ వసీ, ప్రమీల, షీటీమ్ సిబ్బంది, ప్రిన్సిపల్ , ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# అంతరాష్ట్ర కరాటే పోటీల్లో అర్బన్ కేజీబీవీ బాలికల ప్రతిభ



రాజన్న సిరిసిల్ల, మార్చి 18: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని మహా లింగేశ్వర గార్డెన్ లో ఇటీవల నిర్వహించిన అంతరాష్ట్ర ఓపెన్ టు ఆల్ కరాటే పోటీల్లో వేములవాడ అర్బన్ కేజీబీవీ విద్యార్థినిలు ప్రతిభను కబర్చినట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ సప్న తెలిపారు. విద్యార్థినిలు కరాటే లోని కటాస్, కుమి తి విభాగాల్లో బి స్వాతిక, టి ప్రియాంక బంగారు పతకాలు, ఓ అనిత, పి రుచిత, ఏనుగుల ప్రవళిక వెండి పతకాలు, ఎస్ కీర్తన, వి నందిని కాంస్య పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగాపతకాలను సాధించిన క్రీడాకారులతో పాటు విజయం సాధించేందుకు కృషిచేసిన కరాటే శిక్షకురాలు అసిఫియా త బస్సు మ్ ను జిల్లా కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కొండ దేవయ్య, కౌన్సిలర్ మారం కుమార్, రాష్ట్రస్థాయి కరాటే పోటీల ఆర్గనైజర్ అబ్దుల్ మన్నాన్ అభినందించారు.

# అక్రమ భవన నిర్మాణం కూల్చివేత



రాజన్న సిరిసిల్ల, మార్చి 18: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం చంద్రగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని తెట్టెకుంటలో అనుమతులు లేని భవనాన్ని గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కూల్చివేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు. తెట్టెకుంటలోని సర్వే నెంబర్ 5లో చేపట్టిన అనుమతిలేని నిర్మాణాన్ని ముందే గుర్తించి, పలుమార్లు నోటీసులు ఇచ్చినప్పటికీ యజమాని పట్టించుకోకుండా నిర్మాణాన్ని కొనసాగించారని వారు తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి, ఈ నిర్మాణం శిఖం పరిధిలోకి వస్తుందని నిర్ధారించి తొలగింపునకు ఆదేశించారని వివరించారు. దీంతో శనివారం మండల పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది జేసీబీ సహాయంతో అక్రమ నిర్మాణాన్ని తొలగించారన్నారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని, సరైన అనుమతులు లేకుండా గ్రామాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని కోరారు. ఆక్రమణలు, అనుమతులు లేని నిర్మాణాల విషయంలో సంబంధిత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన వివరించారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా భవన నిర్మాణ అనుమతులు ఆన్లైన్లో అందిస్తున్నామని తెలిపారు. నిర్మాణదారులు స్వయంగా గాని, మీసేవ కేంద్రాల్లో గాని సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవచ్చని, నివాసగృహాలకు 15 రోజుల్లో, నివాసేతర నిర్మాణాలకు 30 రోజుల్లో ఆన్లైన్ లోనే అనుమతి పత్రాలు జారీ చేస్తారని ఆయన వివరించారు. అనుమతుల జారీలో ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత మండల పంచాయతీ అధికారులను సంప్రదించాలని ఆయన కోరారు.

# తులసి ఆసుపత్రిలో వైద్యుల అరుదైన శస్త్ర చికిత్స..

## –ఆపరేషన్ చేసి రెండు కిలోల కణతి తొలగింపు..



రాజన్న సిరిసిల్ల, మార్చి 18: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని తులసి ఆసుపత్రిలో శనివారం వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి మహిళ ప్రాణాలు కాపాడారు. కరీంనగర్ పట్టణానికి చెందిన (32) సంవత్సరాల మహిళ గత ఆరు నెలలుగా కడుపునొప్పి, ఆయాసంతో బాధపడుతోంది. ఎన్నో ఆసుపత్రులు తిరిగి మందులు వాడినా నయం కాకపోవడంతో శనివారం తులసి ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చింది.

డాక్టర్లు వైద్య పరీక్షలు చేయగా ఆమె కడుపులో 2 కిలోల కనితి ఉన్నట్లు గుర్తించారు. దీంతో వైద్యులు సదరు మహిళకు ఆపరేషన్ చేయాలని సూచించగా ఒప్పుకోవడంతో రెండు గంటలు శ్రమించి శస్త్ర చికిత్స చేసి కనితిని తొలగించారు.

ఆపరేషన్ చేయడంతో ప్రాణాపాయం తప్పిందని వైద్యురాలు అనిత తెలిపారు. ఆస్పత్రి వైద్యులను పేషంట్ బంధువులు అభినందించారు. ఈ చికిత్సలో మత్తు డాక్టర్ తిరుపతి, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.